# తొలినాటి గ్రామఫోన్ గాయకులు

మొదటి సంపుటి

మొదలి నాగభూషణశర్మ

క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్
1-8-725/ఎ/1, 103సి,
బాలాజీ భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్,
నల్లకుంట, హైదరాబాద్ - 500044
ఫోన్స్ : 98480 65658, 98485 06964

● **తొలినాటి గ్రామఫోన్ గాయకులు** - మొదటి సంపుటి

**Tolinaati Gramophone Gaayakulu** - Volume 1

● ప్రతులు : 500

● ఆవిష్కరణ : **20 మార్చ్, 2010**

ద్వితీయ ముద్రణ : **2011**

తృతీయ ముద్రణ : **2012**

● వెల :

**రూ. 100/- (సి.డి. ఉచితం)**

● పుస్తక రూపకల్పన :

**క్రియేటివ్ లింక్స్**

1-8-725/ఎ/1, 103సి, బాలాజీ భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్,

నల్లకుంట, హైదరాబాద్ - 500044

ఫోన్స్ : 98485 06964, 98480 65658,

● రచయిత చిరునామా:

**ప్రొ॥ మొదలి నాగభూషణ శర్మ**

1-8-702/32/39, పద్మ కాలనీ,

నల్లకుంట, హైదరాబాద్ - 500 044.

ఫోన్స్ : 040-27624765

మొబైల్ : 9246103316

E-mail : modalisarma@rediffmail.com

● ఈ పుస్తకం లభించే చోట్లు :

**విశాలాంధ్ర బుక్ హౌస్ (అన్ని పట్టణ శాఖల్లో)**

**నవోదయ బుక్ హౌస్**

**నవయుగ బుక్ హౌస్**

**తెలుగు బుక్ హౌస్**

**ఆంధ్ర బాలానంద సంఘం, బర్కిట్ రోడ్, టి.నగర్, చెన్నై - 600 017**

# నా మాట

చిన్నతనం నుంచీ తెలుగు గాయకుల గ్రామఫోను రికార్డులు వింటూ, నలుగురిని పిలిచి వినిపిస్తూ వుండేవాడిని. నా తోటి పిల్లలు నా 'పిచ్చి'ని చూసి నవ్వుకునేవారు. పెద్దవాడిని అయిన తరువాత కూడా ఆ రికార్డులలో మన లలిత సంగీత సమ్రాట్టుల పాటలు వింటూ మైమరచిపోతూ వుండేవాడిని. కాని ఈ రికార్డులలో నిక్షిప్తమై వున్న సంగీత సరస్వతిని గురించి నలుగురికీ తెలియజెప్పాలన్న నా ఆకాంక్ష రోజురోజుకూ ఎక్కువ కాసాగింది. ఇన్ని రికార్డులు తిరిగి దొరికేదెలా? అవి జాగ్రత్తపరిచిన వ్యక్తి శ్రీ వి.ఏ.కె.రంగారావుగారు. కానీ ఆయన మద్రాసులో వుంటారు – నాకు సుదూరంగా. నా అదృష్టం కొద్దీ ఒక పుష్కరం క్రితం జె.మధుసూదన శర్మగారు కలిశారు. ఆయన 50 సంవత్సరాలనుంచి రికార్డుల సేకరణలోను, వాటిని భద్రపరచడంలోను, కేటలాగు చేయడంలోను నిమగ్నమై ఉన్నారు. ఆయన సహకారంతో ఆనాటి రికార్డులలోని పాత పాటలను సంగీతాభిలాషులు, నాటకాభిలాషులు అయిన యీతరం వారికి అందించాలన్న తాపత్రయంతో ఈ పనికి పూనుకున్నాను. ఇవి అన్ని అరవై, డెబ్బయ్ ఏళ్ల నాటి రికార్డులు. ఆనాటి గాయకుల ప్రతిభను గురించి ఈనాటి వారికి ఏమీ తెలియదు. వారిని గురించి నాలుగు ముక్కలు చెప్పగలిగితే వారు పాడిన పాటలను మరికొంత శ్రద్ధాసక్తులతో ఈనాటి శ్రోతలు వినగలరని నాకనిపించింది. అనిపించగానే నా హితాభిలాషులు, నాటక, నాట్య, జానపదకళలలో నిష్ణాతులు – 'నడిచే నాటిక విజ్ఞానం'గా ఆంధ్రదేశమంతటా పేరు పొందిన ఆచార్య మొదలి నాగభూషణ శర్మగారిని నేను సి.డి.లో యివ్వబోతున్న ఇరవై మంది నిష్ణాతులైన పాతతరం గ్రామఫోను గాయకులను గురించి సంక్షిప్త పరిచయాలను వ్రాయమని కోరాను. ఆయన అంగీకారం నా ప్రయత్నాలకు ఆశీర్వచనమే. ఈ చిన్న పుస్తకానికి 'తొలినాటి గ్రామఫోను గాయకులు' అని పేరు పెట్టినవారు పెద్దలు, ప్రఖ్యాత నటులు శ్రీ రావి కొండలరావుగారు. వీరందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు.

నా సహచరులు, మిత్రులు చాలామంది ఈ కార్యక్రమంలో నాకు చేదోడు వాదోడుగా నిలిచారు. శ్రీయుతులు జె.మధుసూదన శర్మ, శ్రీకాంత్, వేణుగోపాల్, పి.రమేష్, పరుచూరి శ్రీనివాస్, గౌరీనాథ్, టి.వి.రావు, డా॥ కె.వి.రావు, డా॥ వి.వి.రామారావు, ఓలేటి శ్రీనివాసభాను, హరీష్, ప్రకాశ్, చంద్రం గార్లకు నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాన్ని శరవేగంగా ముద్రించిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్‌కు, దాని అధిపతి జగన్మోహన్ రెడ్డిగారికి నమస్సులు.

ఇటువంటి పాత లలిత గీతాల, నాటకగీతాల సి.డి.ని, దానితో పాటు ఆయా గాయకులను గురించిన పరిచయాన్ని యిస్తూ ఆ రెంటినీ కలిపి ఈనాటి శ్రోతలకు అందించటం ఆంధ్రదేశంలో తొలి ప్రయత్నం. ఈ ప్రయత్నం సఫలమైతే – ఇంకా ఎందరో పాతతరం మహాగాయకుల అమృతోపమానమైన పాటలను మీకు అందించే ప్రయత్నం చేయగలము.

**– యం.సూరిబాబు**

తేది : 20.3.2010

క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్

# విషయసూచిక


1. కపిలవాయి రామనాథశాస్త్రి 5
2. ఉప్పులూరి సంజీవరావు 8
3. సి.ఎస్.ఆర్. ఆంజనేయులు 10
4. అద్దంకి శ్రీరామమూర్తి 13
5. పి. రామతిలకం 16
6. త్రిపురారిభట్ల రామకృష్ణశాస్త్రి 18
7. వేమూరి గగ్గయ్య 20
8. దైతా గోపాలం 23
9. జొన్నవిత్తుల శేషగిరిరావు 25
10. పసుపులేటి కన్నాంబ 28
11. పారుపల్లి సత్యనారాయణ 30
12. చిత్తూరు వి.నాగయ్య 32
13. ఆరణి సత్యనారాయణ 36
14. స్థానం నరసింహారావు 38
15. కొచ్చెర్లకోట సత్యనారాయణ 41
16. పి.సూరిబాబు 43
17. కల్యాణం రఘురామయ్య 46
18. బందా కనకలింగేశ్వరరావు 48
19. యస్.రాజేశ్వరరావు 50
20. టంగుటూరి సూర్యకుమారి 52

అనుబంధం - డిస్కులో ఉన్న గ్రామఫోన్ పాటల వివరాలు 55

'రంగ మార్తాండ'

# కపిలవాయి రామనాథశాస్త్రి



కళా జీవితంలో ఎన్ని ఉన్నతమైన శిఖరాలు అధిరోహించినా, నిత్యజీవితంలో నైతిక విలువలు పాటించకపోతే అంత ఉన్నత శిఖరాల నుంచి కిందకు దిగజారడం ఖాయం - అన్న నానుడికి సరి అయిన నిర్వచనం అమర గాయకుడు కపిలవాయి రామనాథశాస్త్రి జీవితం. ఒక మహోత్తుంగ తరంగంలాగ ఆయన రంగస్థల ప్రవేశం చేశాడు. ఒక వైనతేయుడిలా పైకి, పైపైకి ఎగిరిపోయాడు. ఆంధ్రుల గుండెల్లో ఒదిగిపోయాడు. నాటకరంగంలో ఉండే అన్ని చెడు లక్షణాలకు బానిస అయిపోయాడు. రంగస్థలం మీద నిలబడలేని స్థితి వచ్చింది. చివరకు అతి దీనావస్థలో యీ జీవితరంగం నుంచి నిష్క్రమించాడు.

రామనాథశాస్త్రి 1904వ సంవత్సరంలో కృష్ణా జిల్లా గన్నవరం తాలూకా మంతెన గ్రామంలో జన్మించాడు. కపిలవాయి బుచ్చయ్యశాస్త్రి, లక్ష్మీదేవమ్మగారలు తల్లితండ్రులు. పద్యాలు పాడడం, నాటక పద్యాలు రాగయుక్తంగా చదవడం, రాజరాజేశ్వరిదేవి మీద శ్లోకాలు చదవడం చిన్ననాటి నుంచి అలవాటుగా వచ్చింది అతనికి. చదువు మీద శ్రద్ధ లేకపోవడంతో అయిదవ ఫారం తప్పాడు. తల్లిదండ్రులకు శాస్త్రి భవిష్యత్తును గురించిన విచారం పట్టుకున్న తరుణంలో అదృష్టదేవత ఆయనను అనుగ్రహించింది. 1922వ సంవత్సరం శివరాత్రి పర్వదినం. తన స్వగ్రామం నుంచి బెజవాడ వచ్చి కనకదుర్గను దర్శించుకొని సాయంకాలం తిరిగి వెళ్లిపోవాలని వచ్చిన శాస్త్రి సాయంకాలం ఖాళీ దొరకడంతో ఆ వూళ్లోనే వున్న మైలవరం కంపెనీకి వెళ్లి

తన పాట వినిపించాడు! పరమసమ్మోహనం ఆ పాట! రాజావారు ఆ రోజు నుంచే తన కంపెనీలో నటుడిగా నెలజీతం మీద ఉండి పొమ్మని బయానా యిచ్చారు. ఆ రోజున కాబోయే రంగమార్తాండుడు ఆంధ్ర నటలోకంలో ఉదయించాడు.

బాలభారతిలో మొదట చిన్న పాత్రలను, ఆ తరువాత ఉపపాత్రలను ధరిస్తూ నాట్యచార్య యడవల్లి సూర్యనారాయణగారు ఆ కంపెనీ నుంచి వైదొలగగానే అక్కడి నాయక పీఠం మీద పట్టాభిషిక్తుడైనాడు. యడవల్లి వేసే పాత్రలన్నింటికీ తానే వారసుడైనాడు. 'సతీ సావిత్రి'లో సత్యవంతుడు, 'కృష్ణలీలలు'లో కంసుడు, కృష్ణుడు, 'రామదాసు'లో రామదాసు, 'శాకుంతలం'లో దుష్యంతుడు, 'పాదుకాపట్టాభిషేకం'లో రాముడు, 'రాధాకృష్ణ'లో శ్రీకృష్ణుడు పాత్రలు రామనాథశాస్త్రిని వరించాయి. వానిని చేపట్టి తన అమోఘమైన గాన సంపత్తితో ఆ పాత్రలకు జీవం పోసి ప్రేక్షకులను అలరింపజేశాడు శాస్త్రి.

శాస్త్రి కంఠంలో రాగం సొగసులు వసంతకాలంలో వీచే గాలుల సోయగాలను తలపిస్తాయి. అతని కంఠంలో సుమధుర నాదం అలవోకగా కిందికి పడే జలపాతధారగా వినిపిస్తుంది. పద్యానికి గిరికీల రాగాలు, చాదస్తపు గమకాలు, తలతిక్క పాడిగింపులు ఉండవు. పద్యం ఆద్యంతాల మధ్య పాదంవిరుపులలో ఉంది అతను చూపే భావశబలత. పద సంచయంలో ఉండే పదాలను వెనకముందులు చేసి పద్యం చివర మళ్లీ కవి పద్యపాదానికి వెళ్లడం జరిగేది. వినే వాళ్లకి యీ వ్యత్యస్థ పాదాల వింగడింపులోను, తిరిగి వానిని ఒకటిగా చేసే సమ్మేళనంలోను "అమ్మో! రచయిత యిటువంటి భావాలతో యీ పద్యం రాశాడు కామోసు!" అని నాటక కావ్యానికి కొత్త అర్థాలు తీసి భాష్యాలు చెప్పేవాడు. భావప్రధానంగా, అర్థాన్ని విడమరచి చెప్పే విధంగా, కర్ణపేయంగా నాటక పద్యాన్ని ప్రస్తారం చేయడం రామనాథశాస్త్రి తెలుగు నాటక పద్యానికి యిచ్చిన గొప్పకానుక. రామనాథశాస్త్రి పది పదిహేను సంవత్సరాల ఉధృత రంగస్థల జీవితంలో యీ పద్యానికి రాగం ఎక్కువయిందని, యీ పద్యం అర్థం కాలేదని చెప్పిన ప్రేక్షకుడు లేడు. ఇది శాస్త్రి ప్రతిభావ్యుత్పత్తులకు నిదర్శనం. ఈ విధంగా శాస్త్రి తెలుగు రంగస్థలం మీద "రామనాథ శాస్త్రి బాణీ"ని ప్రవేశపెట్టాడు. ఆ బాణీని అనుసరించి పాడే నటులు రానురాను ఎక్కువైనారు.

1929. రామనాథశాస్త్రి నాటకం అంటే ప్రేక్షకులకు షడ్రసోపేత భోజనం. అంత బలహీనమైన కాయంలో నుంచి అన్ని వందల పద్యాలు - ప్రతి పద్యమూ ఒక ఆణిముత్యంలా - ఎలా ఊడిపడతాయో చూపరులకు ఆశ్చర్యంగా ఉండేది. రామనాథశాస్త్రి పేరు చిరస్థాయిగా తెలుగునాట నిలిచిపోవడానికి దోహదపడిన విచిత్ర సంఘటనలు అప్పుడే జరిగాయి.



హచిన్స్ గ్రామఫోను కంపెనీ నష్టాలలో కూరుకుపోయి హిజ్ మాస్టర్స్ వాయిస్ కంపెనీతో కలిసిపోయిన తరుణం. ఆ కంపెనీ నష్టాలను భర్తీ చేయడానికి హెచ్.ఎం.వి. తెలుగు విభాగం నిర్వాహకుడు రామనాథశాస్త్రిని కొన్ని రికార్డులు యివ్వవలసిందిగా కోరాడట. శాస్త్రి మొదట ఆరు రికార్డులు యిచ్చాడు. అందులో "సర్వేశ్వరుండయిన" అన్నది 1930 జనవరిలో విడుదల అయింది. విడుదల అయిన వెంటనే ఆ రికార్డులు వేల సంఖ్యలో అమ్ముడు పోవడంతో తిరిగి రికార్డు చేసి అమ్మకానికి విడుదల చేయవలసి వచ్చింది. శాస్త్రి ఆ కంపెనీకి 35, 40 రికార్డులు యిచ్చాడు. ఇన్ని రికార్డులు ఒక్క గాయకుడి చేతనే పాడించడం ఆ రోజులలో ఒక రికార్డు! ఈ ప్రయత్నంతో లాభాల బాటపట్టిన గ్రామఫోను కంపెనీ తన అన్ని ఆఫీసులలోను శాస్త్రి ఫొటోను మిగిలిన దక్షిణాది గాయకుల ఫొటోల ప్రక్కన నిలిపిందట!

శాస్త్రి రికార్డులు భారతదేశంలో ఏ రాష్ట్రానికి వెళ్లినా వినిపించేవి. అలాగే శాస్త్రి నాటకాలు కూడా. ముఖ్యంగా దక్షిణదేశంలో శాస్త్రి రికార్డు వినబడని హోటలు ఉండేది కాదు. కొలంబో, రంగూన్‌లలో దాక్షిణాత్యులకు అత్యంత ప్రేమపూర్వకమైన పాటలు రామనాథ శాస్త్రివే!

1933లో శాస్త్రి రంగూన్ నగరంలో నాటకాలు ప్రదర్శించాడు. 1934లో చమిరియా కంపెనీ వారు తీసిన 'శ్రీకృష్ణ తులాభారం' సినిమాలో శాస్త్రి నారదుడి వేషం వేశాడు. రాను రాను మద్యం ఎక్కువై శాస్త్రి వ్యాధుల పాలయినాడు. 1935 సెప్టెంబరులో అతి చిన్న వయసులో ఆ "మెలోడి కింగ్ ఆఫ్ ఆంధ్ర" మనకు దూరమైనాడు. కాని తన రాగమాధుర్యాన్ని, గాన విన్నాణాన్ని, భావప్రస్ఫుటతను తాను పాడిన రికార్డులలో నిక్షిప్తం చేశాడన్నది తెలుగు నాటక ప్రియులకు కొంత ఊరడింపు. ◆

'రంగరత్న', 'రాజహంస', 'గాన కోకిల'

# ఉప్పలూరి సంజీవరావు



ఆడువారినిసైతం భ్రమింపచేసే శరీర సౌందర్య సౌభాగ్యాలతో, లలిత లావణ్యాలతో, కిన్నెర కంఠంతో, నాజూకైన అంగ విన్యాసంతో ప్రేక్షకులను ఆనంద పరవశుల్ని చేసిన ఉప్పులూరి సంజీవరావుగారి స్త్రీవేషధారణం అసామాన్యం. యడవల్లి సూర్యనారాయణ సత్యవంతుడుగా, గురజనాయుడు యముడుగా, సంజీవరావు సావిత్రిగా నటించిన మైలవరం బాలభారతివారి 'సావిత్రి' నాటకం ఆ నటులకు ఎనలేని ఖ్యాతిని, ఆ సంస్థకు కనకవర్షాన్ని కురిపించింది.

సంజీవరావుగారు కృష్ణాజిల్లా పామర్రులో 1889 జూన్‌లో జన్మించారు. చిన్నతనం నుంచీ వున్న సంగీతాభిలాషతో 13వ ఏటనే బందరులోని బుట్టయ్యపేట కంపెనీలో చేరి బాలపాత్రలు ధరించడం ప్రారంభించారు. మరి కొంత కాలం తరువాత స్త్రీ పాత్రలు ధరించడం మొదలు పెట్టారు. కొంచెం పేరు ప్రఖ్యాతులు రావడంతో తన స్వగ్రామం పామర్రులో మానికొండ వెంకటరామయ్యగారు స్థాపించిన పామర్రు కంపెనీలో చేరి 'మోహినీ రుక్మాంగద'లో మోహిని, 'చిత్రనళీయం'లో దమయంతి, 'నరకాసుర'లో సత్యభామ, 'బొబ్బిలి'లో మల్లమాంబ పాత్రలు ప్రేక్షక హృద్యంగా ధరించి మెప్పించారు.

ఈ ప్రఖ్యాతి వల్ల ముందు గున్నేశ్వరరావుగారి కంపెనీలోను, ఆ తరువాత మైలవరం కంపెనీలోను ముఖ్యమైన నాయిక పాత్రలను ధరించారు. ఇక్కడే 'సావిత్రి,

సంపూర్ణ రామాయణం, ప్రహ్లాద, ద్రౌపదీవస్త్రాపహరణం, లవకుశ, హరిశ్చంద్ర' నాటకాలలో ప్రధాన స్త్రీ పాత్రలను ధరించారు. ముఖ్యంగా 'సావిత్రి, శకుంతల' నాటకాలలో నాయక పాత్రలను యడవల్లి సూర్యనారాయణగారు, నాయిక పాత్రలను సంజీవరావుగారు ధరించి ఆంధ్రదేశంలోనే కాక మద్రాసు, బెంగళూరు వంటి నగరాలలోను, రంగూన్‌వంటి పట్టణాలలోను విశేషమైన ఖ్యాతిని గడించారు. ఈరెండు నాటకాలు ఎక్కడ ప్రదర్శించినా కలకత్తా, హైద్రాబాద్, మద్రాసు, బెంగుళూరు పట్టణాలనుంచి టిక్కెట్లు రిజర్వు చేసుకొని నాటకం చూడడానికి వచ్చేవారట! ఈ విధంగా టిక్కెట్లను అమ్మితే వారంముందుగానే హాలులో మొదటి తరగతి టిక్కెట్లు అమ్ముడు పోయేవట! అంతటి ప్రశస్తి యీ నాటకాలకు, యీ నటులకు.

సంజీవరావుగారు అటు ఉదాత్తమైన చంద్రమతి, సావిత్రి, సీత వంటి పాత్రలను ధరించి ప్రేక్షకులను అలరించినా శృంగార కరుణ రసాలను మెప్పించడంలో ఆయనకు మరెవ్వరూ సాటిరారు. శకుంతల, సావిత్రి, ద్రౌపది పాత్రలలో ఆయన నటన ఆసాంతం ప్రతిభావంతం.

అటువంటి ప్రతిభను కనబరచడానికి అనువుగా సంజీవరావుగారు తమ ఆహార్యాన్ని జాగ్రత్తగా సంతరించుకునేవారు. ప్రతిపాత్రను పాత్ర లక్షణాలనుబట్టి రమణీయంగా తీర్చిదిద్దుకునేవారు. స్త్రీ సహజమైన లాలిత్యాన్ని సాధించడంకోసం ఎన్నో ఒద్దికలను చేసేవారు.

ఆయన ఆలపించిన పాటలు - ముఖ్యంగా 'సావిత్రి'లోని 'పోవుచున్నాడే' అన్నపాట ఆంధ్ర ప్రేక్షకుల హృదయాలలో స్థిరంగా నిలిచిపోయింది. కొంతకాలం అనారోగ్యంతో బాధపడి నాటక ప్రదర్శనలనుంచి విరమించుకొనే ప్రయత్నంచేసినా, ప్రేక్షకుల పట్టుదలతో కూర్చొనే నటించవలసివచ్చింది. ఆ తరువాత కొంతకాలం సీతారామాంజనేయ నాటక సమాజంలోను, మరికొన్నాళ్ళు అల్లూరు పర్వతరెడ్డి రామచంద్రారెడ్డిగారి సమాజంలోనూ నటించారు. 40సంవత్సరాల సుదీర్ఘ నటజీవితంలో బళ్లారి రాఘవ, యడవల్లి, జొన్నవిత్తుల, గగ్గయ్య, సి.యస్.ఆర్. వంటి మహామహులతో నటించారు. 1932లో బెంగుళూరులోని హచ్చిన్స్ కంపెనీ వారికోసం చాలా పాటలను రికార్డురూపంలో ఇచ్చారు.

ఉప్పులూరి సంజీవరావుగారు 1957 సెప్టెంబరు 11వ తేదీన పరమపదించారు. కాని ఆయన తీర్చిదిద్దిన స్త్రీ వేషాలు మాత్రం తరువాత నటీనటులందరికీ ఒరవడిగా నిలిచాయి. ◆

'అభినవ కృష్ణ'

# సి.ఎస్.ఆర్. ఆంజనేయులు



తెలుగువారి రంగస్థలం పాటలతో, పద్యాలతో "రాగ రంజితమై," గానమే నటన"- అనే భావనలో నటులు, ప్రేక్షకులు కూడా ఉన్న తరుణంలో తెలుగు నాటక రంగానికి పద్యాలు, పాటలతోపాటు వాటిని పాత్రకు అనుసంధానం చేసి ఆ పాత్రను ఆవిష్కరించడానికి గద్యపద్యాల సమన్వయం ఎలా ఉపయోగపడుతుందో స్వయంగా చూపి, తనదైన "బాణీ"ని రంగస్థలం మీద నిలబెట్టుకున్న నటశిరోమణి సి.యస్.ఆర్. అని పిలవబడే చిలకలపూడి సీతారామాంజనేయులు.

సి.యస్.ఆర్. పూర్వీకులది బందరు పక్కనే ఉన్న చిలకలపూడి. ఆ తరువాత గుంటూరు జిల్లా పొన్నూరులో వీరి కుటుంబం స్థిరపడ్డది. ఆయన బాల్యం అంతా పొన్నూరులోనే గడిచింది. స్కూలు ఫైనల్‌వరకు చదివి కొంతకాలం కోఆపరేటివ్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగం చేశారు. తండ్రికూడా నటుడు కావడంతో వారి ప్రభావం ఆయనమీదపడ్డది. తన తోటి వారంతా పై చదువులకు, ఉద్యోగాలకు వెడుతుంటే, సి.యస్.ఆర్. తన భవిష్యత్తును వెతుక్కోవడానికి నాటక రంగం వైపుకు దృష్టి మరలించారు.

అనతికాలంలోనే ఆయన ధరించే పాత్రలు, ఆ పాత్రల నిర్వహణలో ఆయన

చూపే ప్రత్యేకమైన వైవిధ్యం మహామహులైన నటుల మధ్యకూడా ఆయనకు గుర్తింపును తెచ్చాయి. ఆయన మధురమైన గాత్రం, సమ్మోహనమయిన ముఖం, పద్యాలవిరుపు, మధ్యలో ఆ పద్యాన్ని గద్యంతో సమ్మిళితంచేసే వాచిక విన్యాసం - యీ సరికొత్త "వ్యాఖ్యానాత్మక మైన పాత్ర చిత్రణం"తో సి.యస్.ఆర్.ను గొప్పనటుల సరసన ఆత్మస్థయిర్యంతో నిబడేటట్లు చేశాయి. ముఖ్యంగా 'శ్రీకృష్ణతులాభారం'లో, 'రాధాకృష్ణ'లో శ్రీకృష్ణుని పాత్ర ఆయనకు ప్రఖ్యాతిని సంపాదించి పెట్టింది.

అలాగే 'రామదాసు' నాటకంలో రామదాసు పాత్ర, 'భక్తతుకారాం' నాటకంలో తుకారాం పాత్రలద్వారా ఆయన అఖండమైన కీర్తిని గడించారు. సి.యస్.ఆర్. ఏ పాత్ర ధరించినా ఆ పాత్రే మనముందు సాక్షాత్కరించేది కాని సి.యస్.ఆర్ కనిపించేవాడుకాడు. రంగస్థలం ముందుకు వచ్చి గిరికీల సంగీతం వినిపించే నటులతోను, తమ స్వంత ప్రతిభను చూపించుకొనే నటులున్న నాటక రంగంలోను ఇది విప్లవాత్మకమైన మార్పు. ఈ గొప్ప నట లక్షణాన్ని తరువాత రోజులలో ఆయన సినిమా నటనలో కూడా కనబరిచి అనితర సాధ్యమైన విజయాలను సాధించాడు.

స్వయం ప్రతిభతో, స్వయంకృషితో, చేస్తున్న పనియెడల శ్రద్ధా భక్తులతో, తన నలభై సంవత్సరాల నట జీవితాన్ని అర్థవంతంగా కొనసాగించిన నటుడు సి.యస్.ఆర్.

రంగస్థలం నుంచి సినిమారంగానికి వచ్చిన సి.యస్.ఆర్. మొట్టమొదట కృష్ణ పాత్రలోనే నటించారు, 'ద్రౌపదీవస్త్రాపహరణం'లో. దీనికి పోటీగా సాగిన 'ద్రౌపదీమాన సంరక్షణం' కన్న విజయవంతం కావడంతో సి.యస్.ఆర్. సినిమారంగంలో స్థిరపడిపోయారు. తరువాత కోయంబత్తూరు సెంట్రల్ స్టూడియోస్ వారు నిర్మించిన 'భక్త తుకారాం'లో తుకారాం పాత్రను నిర్వహించారు. ఆనాటినుంచి జీవితం చివరి రోజుల వరకు దాదాపు 150 చిత్రాలలో నటించి తనకు, తాను నటించిన పాత్రలకు ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చారు. ఆయన నటించిన సినిమాలలో ముఖ్యమైనవిగా 'సుమతి', 'తల్లిప్రేమ', 'వెంకటేశ్వర మహాత్మ్యం', 'భీష్మ', 'పాదుకాపట్టాభిషేకం', 'గృహప్రవేశం', 'పరమానందయ్య శిష్యులు', 'సాయిబాబా', 'వాలి సుగ్రీవ', 'మాయాబజార్', 'పాతాళభైరవి', 'దేవదాసు', 'చక్రపాణి', 'సక్కుబాయి', 'రోజులుమారాయి', 'సువర్ణసుందరి', 'జగదేకవీరునికథ', 'అప్పుచేసి పప్పుకూడు' - మొదలయిన వానిని పేర్కొనవచ్చు.

ఈ సినిమాలన్నింటిలో ఎంతో వైవిధ్యం ఉన్న పాత్రలను ధరించాడు సి.యస్.ఆర్. నాయకుడిగా, ప్రతినాయకుడిగా, వలపుకాడుగా, దుష్టుడుగా,



'ద్రౌపదీ వస్త్రాపహరణం'లో కృష్ణుడుగా

జిత్తులమారిగా ఆ పాత్రల సంపూర్ణతత్వాన్ని మనముందు ఆవిష్కరించాడు ఆయన. తనకు తృప్తి కలిగేటంతవరకు పాత్రల ఆంగిక చేష్టలను, వాచిక విధానాన్ని, భావవ్యక్తీకరణను తిరిగి తిరిగి మననం చేసుకొని తాను ధరించిన ప్రతి పాత్రకు న్యాయం చేసిన ఉత్తమనటుడు సి.యస్.ఆర్.

ఆయన చమత్కారి. పాట ఎంతబాగా పాడేవాడో అంత అద్భుతంగాను హార్మోనియం వాయించేవాడు. స్నేహ పాత్రుడు. జాతీయవాది. అస్పృశ్యతా నివారణ కోసం 'పతితపావన' నాటకం రాయించి దేశమంతటా ప్రదర్శించి దేశభక్తుల మన్ననలందుకున్నాడు. తన నాటకాల ద్వారా ఎన్నో దేశభక్తి కార్యక్రమాలకు ధన సహాయం చేశాడు.

ఈ గొప్ప నటుడు 1963వ సంవత్సరం అక్టోబరు 8న కన్నుమూశాడు. రంగస్థలంమీద, సినిమా రంగంలోను పదికాలాల పాటు జ్ఞాపకం ఉండేలా తన పాత్రలను తీర్చిదిద్దుకొన్న విశిష్టనటుడు, మధురగాయకుడు, స్నేహశీలి సి.యస్.ఆర్.

◆

'నాటక కళాప్రపూర్ణ'

# అద్దంకి శ్రీరామమూర్తి



వేషగౌరవంతో, అభినయ ప్రావీణ్యంతో, సంగీత ప్రభావంతో తెలుగు ప్రేక్షకుల గౌరవాభిమానాలు పొందిన వారిలో 'నాటక కళాప్రపూర్ణ' అద్దంకి శ్రీరామమూర్తిగారు ఒకరు. పాత్రలకు అనువైన విగ్రహసౌష్టవం, ఆ రెంటికీ నిండుదనం తెచ్చే రాగాలాపనం, వాటికి గుర్తింపు తేగల అభినయం అద్దంకి వారికి ప్రేక్షకాదరణం సంపాదించిపెట్టాయి.

అద్దంకి శ్రీరామమూర్తిగారు 1892 సెప్టెంబరు 21వ తేదీన గుంటూరు జిల్లా కలవకుర్రుగ్రామంలో జన్మించారు. తండ్రి వెంకట్రాయుడుగారు తరంగాలు, అష్టపదులు గానం చేయడంలో దిట్ట. అద్దంకి వారికి చిన్నతనంలోనే తండ్రిగారి నుంచి సంక్రమించిన కళ సంగీతం. 1911లో బాపట్లలో స్కూలులో చదువుకొనే రోజుల్లోనే గయోపాఖ్యానంలో సహదేవుడి పాత్ర ధరించి రంగప్రవేశం చేశారు. ఔత్సాహిక నాటకసమాజాలలో ఆయన ధరించే పాత్రలు, ఆ పాత్రలను ప్రదర్శించడంలో అద్దంకి కనబరచే నైపుణ్యం కృత్తివెంటి నాగేశ్వరరావుగారిని ఆకర్షించింది. అద్దంకి 'హిందూ నాటక సమాజం'లో సభ్యుడై, అక్కడ ఉన్న మూడు సంవత్సరాలు ఆ సభకు సంగీతదర్శకుడైన పాపట్ల కాంతయ్యగారి శిష్యరికం చేసి నాటక సంగీతంలోని లోతులను అవగాహన చేసుకొన్నారు. ఆ సభ చీలిపోవడంతో


విజయవాడ చేరుకొని పిలిచినవారితో నాటకాలు ఆడుతూ గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్యగారి దగ్గర సంగీత శిక్షణ పొందారు. కొంతకాలం బందరులోని బాల భరత సమాజం నాటకాలలో పాల్గొని మైలవరం బాలభారతీ సమాజానికి ఆహ్వానింపబడ్డారు. అపర భరతమునిగా పేరుగాంచిన బి.టి.రాఘవాచారిగారి దగ్గర నృత్య అభినయ విద్యలను అభ్యసించారు. కాకినాడలో జరిగిన "పాదుకాపట్టాభిషేకం" పోటీలలో పాల్గొని దశరథ పాత్రాభినయానికి ప్రథమ బహుమానం పొందారు. ఆ బహుమానం అద్దంకిని మోతే నారాయణరావుగారి ఆధ్వర్యంలో నడిచే శ్రీ సీతారామాంజనేయ నాటక సమాజంలో సభ్యుడిని చేసింది. ఈ నాటక సంస్థలో చేరి ఆనాడు ప్రఖ్యాతులైన యడవల్లి సూర్యనారాయణ, ఉప్పులూరి సంజీవరావు, కపిలవాయి రామనాథశాస్త్రి, జొన్నవిత్తుల శేషగిరిరావు వంటి ఉద్దండులైన నటులతో దీటుగా నటించి "అభిజ్ఞాన శాకుంతలం"లో కణ్వుడుగా, "పాండవోద్యోగం"లో ధర్మరాజుగా, "పాదుకా పట్టాభిషేకం"లో దశరుథుడుగా తన ప్రజ్ఞాపాటవాలు చాటారు. బళ్లారి రాఘవ, హరి ప్రసాదరావు వంటి మహామహుల ఆదరాభిమానాలకు పాత్రులయ్యారు. మహారాజుల, జమీందారుల సన్మానాలు అందుకొన్నారు. పండిత విమర్శకుల ప్రశంసలు పొందారు. క్రింది వేషం నుంచి పై వేషం వరకు వేసేవారు. సీతతో ప్రారంభించి దశరధునితోను, ముని బాలకునితో ఆరంభించి కణ్వునితోను, సహదేవునితో ప్రారంభించి ధర్మరాజుతోను వారి అభినయ ప్రస్థానం పరాకాష్టకు చేరింది.

1935లో చలనచిత్ర రంగానికి ఆహ్వానింపబడి దాదాపు 25 చిత్రాలలో విభిన్నమైన పాత్రలను సమర్థవంతంగా నటించారు. 'హరిశ్చంద్ర'లో హరిశ్చంద్రుడుగా సినిమా జీవితం ప్రారంభించి, 'సారంగధర', 'నరనారాయణ', 'చిత్రనళీయం', 'మహానంద', 'భోజ కాళిదాసు', 'భక్తిమాల' వంటి అనేక చిత్రాలలో తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు.

ఆకాశవాణి, విజయవాడ కేంద్రం నుంచి శాస్త్రీయ సంగీత కచేరీలలో పాల్గొని సంగీతజ్ఞుల ప్రశంసలు అందుకున్నారు. పండిత సభల్లో సువర్ణ ఘంటా కంకణ బహుమానాలు పొందారు.

గ్రామఫోను రికార్డులు ప్రశస్తినందుకొనే రోజులలో అద్దంకి శ్రీరామమూర్తిగారు దాదాపు 50 రికార్డులు యిచ్చారు. ఆ రికార్డులు వేల సంఖ్యలో అమ్ముడు పోయాయి.

50 సంవత్సరాల పాటు తెలుగు నాటక, సినీరంగాలలో తనదైన ప్రత్యేకతను




**'బ్రహ్మరథం' సినిమా పత్రికా ప్రకటన**

---

నిలుపుకొన్న బహుముఖ ప్రజ్ఞాశాలి అద్దంకి. పాత్రోచితమైన వేషభూషలు, సంగీతం మాత్రమే అద్దంకి ఖ్యాతికి కారణాలు కావు. ఆయన వాచిక విధానం కూడా ప్రేక్షకుల ప్రశంసలు అందుకొన్నది. ఆయన గంభీర స్వరం, సశాస్త్రీయమైన సంగీతం, ఆకర్షవంతమైన గాత్రమాధుర్యం, పాత్రల మనోభావాలను తేలికగా అవగతం చేసే వాచిక విన్యాసం - అద్దంకి శ్రీరామమూర్తిగారికి తెలుగు నాటక, సినీరంగాలలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కల్పిస్తున్నది. ◆

'గాన కోకిల'

# పి. రామతిలకం



తెలుగు సినిమా పరిశ్రమ తొలి దినాలలో కీర్తి ప్రతిష్టల నార్జించిన తారాగణంలో పేర్కొనదగిన నటీమణులు ముగ్గురు - సురభి కమలాబాయి, రామతిలకం, శ్రీరంజని. వీరిలో రామతిలకం కంఠమాధుర్యంతోను, నాట్య చాతుర్యంతోను యావదాంధ్రుల ఆదరాభిమానాలను పొందిన నటి.

ఈమె నివాస స్థలం విజయవాడ. జననం **1911.** మృదంగ వాద్యంలో ప్రసిద్ధిగాంచిన పువ్వుల వెంకట రత్నంగారి పుత్రిక. తనకు దగ్గరి బంధువైన పువ్వుల నారాయణగారి దగ్గర సంగీతం అభ్యసించి కచేరీ చేయగలిగిన జ్ఞానాన్ని సంపాదించింది. కొన్ని చోట్ల కచేరీలు చేసి బహుమతులు కూడా పొందింది. అంత సౌందర్యవతి కాకపోయినా అంగసౌష్టవం, హావభావాలు ఆకర్షణీయంగా ఉండేవి. నొక్కులు గలిగిన మృదువైన శిరోజాలు, విశాలమైన నేత్రాలు ఆమె నటనకు అలంకారాలు. కట్టుగా సంగీతం చెప్పుకోవడం వల్ల అచిరకాలంలోనే రంగస్థలం మీద నటిగా గుర్తింపు తెచ్చుకొన్నది. **1929**లో మైలవరం బాలభారతి సమాజానికి మేనేజరుగా ఉన్న కొమ్మూరి పట్టాభిరామయ్యగారు ప్రారంభించిన లక్ష్మీవిలాస సభలో ప్రముఖ పాత్రలు ధరించింది. ఆ తరువాత కపిలవాయి రామనాథశాస్త్రితో కలిసి ఆయన బాలభారతి



నాట్యమండలిలో చింతామణి, చిత్రాంగి, సత్యభామ, అహల్య, సావిత్రి మొదలైన వేషాలు వేసింది. రామనాథశాస్త్రి, రామతిలకం ల నాయికా నాయక వేషాలు ప్రజలను అమితంగా ఆకర్షించాయి. కపిలవాయితో విడిపోయి కొంతకాలం పులిపాటి వెంకటేశ్వర్లుతో కలిసి నాటకాలాడింది. తాను చేపట్టిన ప్రతి పాత్రలోను తన సంగీత అభినయాలతో ప్రథమ శ్రేణి నాక్రమించింది.

ఆమె 1932వ సంవత్సరంలో కలకత్తా ఈస్టిండియా ఫిల్ము కంపెనీవారు నిర్మించిన 'సావిత్రి' శబ్ద చలనచిత్రంలో సావిత్రి పాత్రను ధరించి అఖండకీర్తి ప్రతిష్టలార్జించింది. 1933లో కాళ్లకూరి సదాశివరావు దర్శకత్వం వహించిన కలకత్తా మదన్ ఫిలిం కంపెనీ వారి 'చింతామణి'లో చింతామణి పాత్రను ధరించింది. తరువాత వేల్ పిక్చర్స్ వారి 'సీతాకల్యాణం'లో కైక పాత్రను ధరించింది. 'కృష్ణలీలలు'లో ఆమె యశోద పాత్రను ధరించి తన గానమాధుర్యంతోను, ఉద్వేగపూరితమైన భావ ప్రకటనతోను ప్రేక్షకులను ఆకట్టుకున్నది. ఆ తరువాత హెచ్.ఎమ్.రెడ్డిగారి 'ద్రౌపదీవస్త్రాపహరణం'లో, సి.యస్.ఆర్. కృష్ణ పాత్ర ధరిస్తే, ఆమె సత్యభామ పాత్రను ధరించింది. ఆమె తరువాతి చిత్రాలు 'సతీ తులసి', 'మోహినీ రుక్మాంగద'. ఆమె నటించిన చివరి చిత్రం 'నరనారాయణ'. ఈ చివరి చిత్రాలు ఆర్థికంగాను, కళాత్మకంగాను విజయవంతం కాకపోవడంతో ఆమె సినిమారంగం నుంచి నిష్క్రమించింది. సంగీత సంపదలోను, కంఠమాధుర్యంలోను ఆమెతో పోల్చదగిన తార ఆ తొలిదినాలలో లేదని చెప్పడం అతిశయోక్తి కాదు. ◆

'అపరనారదుడు'

# త్రిపురారిభట్ల రామకృష్ణశాస్త్రి



సంప్రదాయ కీర్తనలకు, తరంగాలకు, భజనలకు నిలయమైన ఆంధ్రదేశంలో ఎందరో వాగ్గేయకార, గాయక శిఖామణులకు ఆలవాలమైన ఆంధ్రదేశంలో తన భక్తిగానంతోను, సంగీత సాహిత్య నృత్య సమ్మేళనంతోను, ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని ప్రసాదించి, అపరనారదుడుగా పేరు ప్రఖ్యాతులు పొందిన నటుడు టి.రామకృష్ణశాస్త్రి. ఆయన నారదుడుగా, తరంగ గానం చేస్తూ ఆ లయకు తగిన అడుగులు వేస్తూ, విష్ణునామ స్మరణతోను, తన్మయత్వంతోను రంగస్థల మీదకు ప్రవేశించడం ఆ పాత్ర చిత్రణలో ఒక కొత్త విధానానికి మార్గదర్శకం అయింది.

శాస్త్రిగారు 1914 ఏప్రిల్ 10వ తేదీన తెనాలి తాలుకా పెదరావూరులో జన్మించాడు. త్రిపురారిభట్ల రాఘవయ్య, కామేశ్వరమ్మలు తల్లితండ్రులు. వంశపారంపర్యంగా వచ్చిన తరంగ గానంతో ప్రేక్షకులను అలరించే చిన్నశాస్త్రిని 9వ ఏటనే తెనాలి రామవిలాససభ ఆహ్వానించింది. అందులో ప్రవేశించి బాలపాత్రలు ధరించడంలో నిష్ణాతుడనిపించుకొన్నాడు. 1926లో దంటు వెంకట కృష్ణయ్యగారు గుంటూరులో బాలమిత్ర సభను ప్రారంభించి, బాలనటులతో ఒక బృందాన్ని తయారు చేశారు. శాస్త్రిగారిని ఆ సమాజంలోకి ఆహ్వానించారు. సహనటులైన పి.సూరిబాబు,

కల్యాణి, నాగలింగం ప్రభృతులతో పాటు ఆ సంస్థలో ప్రధాన నటుడై "రోషనార"లో శివాజి, 'కృష్ణలీలలు'లో యశోద, 'రామదాసు'లో రామదాసు పాత్రలను సమర్థవంతంగా నిర్వహించారు. అశేషమైన ఖ్యాతిని, అసంఖ్యాకమయిన సన్మానాలను అందుకున్నారు.

ప్రఖ్యాత నాటక సమాజాలు మూతబడిపోయి వృత్తి నాటకాలు వెనకబడి, కాంట్రాక్టు నాటకాలు ఎక్కువ అయిన రోజుల్లో రామకృష్ణ శాస్త్రిగారు స్థానం నరసింహారావు, సి.యస్.ఆర్. ఆంజనేయులుగార్లతో కలిసి తులాభారంలో నారదుడుగా నటించి ఆంధ్రదేశ సంచారం చేస్తూ ఆనాటి ప్రసిద్ధ దర్శకులు చిత్రపు నారాయణమూర్తిగారి దృష్టిని ఆకట్టుకున్నారు. శాస్త్రిగారి సరస నటనా సంగీత అభినయాలకు ముగ్ధులై ఆయన తాను నిర్మిస్తున్న 'మోహినీ రుక్మాంగద'లో నారదునిగా నటించడానికి ఆహ్వానించారు. ఆ సినిమాలో ఆయన నృత్యమూ, తరంగగానమూ ప్రజామోదాన్ని పొందడంతో ఆ తరువాత 'మార్కండేయ', 'దక్షయజ్ఞం', 'ప్రహ్లాద', 'మైరావణ', 'సుమతి' వంటి 12 చిత్రాలలో నటించారు - ముఖ్యంగా నారదపాత్రలో.

పౌరాణిక చిత్రాలకు ప్రాముఖ్యత తగ్గిన రోజుల్లో శాస్త్రిగారు తిరిగి నాటకరంగ ప్రవేశం చేసి కలియుగ ఆంజనేయ బిరుదాంకితుడైన బేతా వెంకటరావుగారి 'రామాంజనేయ యుద్ధం'లో నారదుని పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తూ కొన్ని వందల ప్రదర్శనలిచ్చారు. ఆ తరువాత అనేక నాటక సమాజాల ప్రదర్శనలలో పాల్గొని బిల్వమంగళుడు, శివయోగి, రామదాసు, కబీరు, నారదుడు పాత్రలలో నటించి ప్రఖ్యాతి చెందారు.

1952లో స్థానం నరసింహారావుగారు న్యూఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ సమక్షంలో ప్రదర్శించిన 'శ్రీకృష్ణతులాభారం'లో నారద పాత్ర ధరించి పెద్దల మన్నలను పొందారు. 60 సంవత్సరాలు దాటినా అలుపెరుగని నృత్యంతో, తరంగగాన తన్మయత్వంతో ప్రేక్షకులను అలరించిన త్రిపురాభట్ల రామకృష్ణశాస్త్రిగారు వృద్ధాప్యంతో తన స్వగ్రామం పెదరావూరులో స్వర్గస్థులైనారు. ◆

రంగసింహ

# వేమూరి గగ్గయ్య



నాటకరంగం మీద, సినిమారంగంలోను ఒకేసారి ప్రేక్షకామోదం పొందిన అతికొద్ది మంది తెలుగు నటులలో వేమూరి గగ్గయ్య ఒకరు. అలాగే, ప్రతినాయక పాత్ర ధరిస్తూ ఉన్నా ప్రజలు జేజేలు పలికిన నటుడు కూడా గగ్గయ్యే! ఆయన పేరు చెబితే ఏడ్చే పిల్లలు ఏడుపు మానేవారు. ఆయన నటిస్తున్న నాటకాలకు గర్భిణీ స్త్రీలు రావద్దన్న హితవు చెప్పేవారు నాటక సంస్థల యజమానులు. రంగస్థలం మీదికి ఆయన రాకయే భయం కలిగించేది. ఆ ఖంగుమనే కంఠం, ఆ నిర్భీకత - ఆయనను రెండు తరాల ప్రేక్షకలోకానికి ప్రీతి పాత్రుడిని చేశాయి. వాటికి తోడు ఆయా దుష్టపాత్రలకు ఆయన పాడిన పాటలు ప్రేక్షకులకు అనునిత్యం పాడుకొనే పాటలయినాయి. ఆ పాటలు గ్రామఫోను రికార్డులుగా వచ్చి రికార్డు స్థాయిలో అమ్ముడుపోయాయి. ఆయన ప్రజాదరణకు అది ఒక నిదర్శనం.

గగ్గయ్యగారు **1895**వ సంవత్సరం మే **15**వ తేదీన తమ ఆనువంశిక గ్రామం అయిన గుంటూరు జిల్లా వేమూరులో జన్మించారు. తండ్రి ఆ వూరు కరణం. చిన్నతనంలోనే తండ్రి మరణించడం వల్ల గగ్గయ్యగారి బాల్యం - సంరక్షణ, క్రమశిక్షణ లేనిదైపోయింది. నాటకాలు చూడడం ఆనాటి యువకుల కార్యక్రమాలలో ఒకటి. గగ్గయ్యకు సురభివారి నాటకాలంటే అమితమైన ప్రీతి. వీరి నాటకాలలో వేషాలు వేయాలనే కోరికతో రాగయుక్తంగా పద్యం చదవడం నేర్చుకున్నారు. అన్నగారికి కూడా



**కంస పాత్రలో**

తెలియకుండా ఒక సురభి కంపెనీ రంగూన్ వెడుతూ వుంటే, గగ్గయ్యగారు కూడా వారితో ప్రయాణం అయినాడు. పది నెలలపాటు వారితో తిరిగి, నాటకాలు వేశాడు. తిరిగి వచ్చాక తెనాలి ఫస్టు కంపెనీ ('శ్రీకృష్ణవిలాససభ' అంటారు దీనిని)లో చేరి నాటకాలు ఆడారు. ఆయన రంగస్థల నటన, రౌద్ర ప్రధానమైన పాత్రలలో ఆయన చూపించే నైపుణ్యం ఆరోజులలో అతి ముఖ్యమైన వృత్తినాటక సమాజమయిన మైలవరం కంపెనీ (దీని పేరు 'బాలభారతి నాటక సమాజం') యజమాని మైలవరం రాజాగారు విని ఆయనను తమ సంస్థలోకి ఆహ్వానించారు. అప్పటి నుంచి ఆ సంస్థ మూతబడేదాకా దానిలో ప్రధాన ప్రతినాయక పాత్రలు ధరించారు. 'కృష్ణలీలలు'లో కంసుడు, 'సతీ సావిత్రి'లో యముడు, 'ద్రౌపదీ వస్త్రాపహరణం'లో శిశుపాలుడు,

'ప్రహ్లాద'లో హిరణ్యాకశిపుడు పాత్రలు ఆయనకు విశేషకీర్తిని ఆర్జించి పెట్టాయి. మైలవరం కంపెనీ తరువాత నంద్యాల మహానందరెడ్డి కంపెనీలో కొన్నాళ్లు పనిచేశారు.

'కృష్ణలీలలు'లో ఆయన పాడిన "ధిక్కారముల్ సైతునా!", సావిత్రిలోని "పోబాల పొమ్మికన్, ఈ మృగారణ్యమున రావలదు, రాతగదు, రా జనదు పోబాల పొమ్మికన్", వంటి పాటలు శ్రోతలను అలరించాయి.

1933లోనే సినిమా రంగ ప్రవేశం చేశారు, సి.పుల్లయ్యగారి "సావిత్రి"లో యమునిగా. అది విజయవంతం కావడంతో ఆ తరువాత 'శ్రీకృష్ణలీలలు'లో కంసుడుగా, 'సతీ తులసి'లో జలంధరుడుగా, 'ద్రౌపదీ వస్త్రాపహరణం'లో శిశుపాలుడుగా నటించి సినిమారంగంలో తన పేరును చిరస్థాయిగా ఉండేటట్లు చేసుకున్నారు. ఆ తరువాత 'మోహినీ రుక్మాంగద', 'జరాసంధ', 'మార్కండేయ', 'మైరావణ', 'చండిక', 'దక్షయజ్ఞం', 'ప్రహ్లాద', 'గరుడ గర్వభంగం', 'సీతారామ జననం', 'భక్త శ్రీయాళ' సినిమాలలో నటించారు. ఒక ప్రక్క తనకు గౌరవ ప్రతిష్ఠలను తెచ్చిన నాటకరంగాన్ని విడిచి పెట్టకుండానే, ప్రజామోదం పొందే సినిమాలలో కూడా నటించి రెండు మాధ్యమాలలోను తనదైన సాధికారతను నిలుపుకోవడం గగ్గయ్యగారి ప్రత్యేకత.

సినిమాలలో నటిస్తూ వుండగానే గ్రామఫోను రికార్డు కంపెనీల ఆహ్వానంతో ఎన్నో రికార్డులు యిచ్చారు. తన పాత్రల ద్వారా జనరంజకమైన ఎన్నో పాటలను ఆయన రికార్డుల కోసం పాడారు. ఏది చేపట్టినా దీక్షతో చేయడం వల్ల ఆయన రాణించని రంగం అంటూ ఏదీ లేదనే చెప్పాలి.

నిండైన గాత్ర సౌష్టవం, పాత్రోచితమని ఆనాటి ప్రేక్షకులు భావించే విధంగా ఆంగికాభినయం, గంభీర స్వరంతో ఉండే వాచిక స్పష్టత, రౌద్రభావాలను తేలికగా పలికించే విశాలమైన ముఖం - అన్నిటినీ మించి ఆయన సౌహార్దం, సంస్కారవంతమైన ఆయన జీవితం - ఆయనను ఓటమి ఎరుగని కళాజీవిని చేశాయి.

రంగస్థలం మీద, సినిమాలలోను దుష్ట పాత్రలను ధరించిన గగ్గయ్య నిజజీవితంలో అతి సౌమ్యుడు. దైవభక్తి, పాపభీతి ఎక్కువ. తోటి నటుల్ని ఇబ్బందుల నుంచి కాపాడడానికి ఆయన ఎన్నడూ వెనకాడేవారు కాదు. సూరిబాబుగారు "తమ కంపెనీ బెంగుళూరులో నాటకాలు ఆడుతూ అప్పులపాలయింది, వచ్చి సాయం చేయండి" అన్న వెంటనే బెంగుళూరు వెళ్లి 17 సావిత్రి నాటకాలు, 4 సతీతులసి నాటకాలు ఆడి ఆ కంపెనీని కష్టాల నుంచి తప్పించారు.

ఇలా నిత్యజీవితంలోను, రంగస్థలం మీద ద్విపాత్రాభినయం అతి ప్రతిభావంతంగా చేసిన గగ్గయ్య 1955 డిసెంబరు 30వ తేదీన మరణించారు. ◆

'సంగీత నట చక్రవర్తి'

# ధైతా గోపాలం



తన గానమాధుర్యంతోను, భావ వ్యక్తీకరణంతోను అభినయ చాతుర్యంతోను ప్రేక్షకులలో భక్త్యావేశాన్ని కల్గిస్తూ నాటక పర్యవసానం శాంతరస ప్రధానమని నిర్ణయించి తదనుగుణంగా పాత్ర పోషణ చేయగల సమర్థుడైన నటుడు ధైతా గోపాలం. ఆయన నటించి దర్శకత్వం వహించిన నాటకం, భక్తి రసప్రధానమైన నాటకం మల్లాది అచ్యుతరామ శాస్త్రిగారు రచించిన 'సక్కుబాయి'.

గోపాలం కృష్ణాజిల్లా శ్రీకాకుళానికి శివారు గ్రామమైన పాపనాశనంలో జన్మించాడు. తండ్రి వెంకటాచలం; తల్లి అన్నపూర్ణమ్మ. అక్కగారు పెద్దిభొట్ల ఆదిలక్ష్మమ్మగారితో పాటు గోపాలం కూడా చిన్నతనం నుంచీ సంప్రదాయ సంగీతం నేర్చుకున్నాడు. శ్రీకాకుళేశ్వర స్వామికి జరిగే వార్షికోత్సవాలలో ప్రక్కనే వున్న కూచిపూడి యక్షగానాలకు ఎక్కువ పరపతి. చిన్నతనంలోనే ఆ యక్షగాన పద్ధతులను ఆకళింపు చేసుకున్నాడు గోపాలం. క్రమంగా నాటక సందర్శనాభిలాష నుంచి రంగస్థల నటనాకాంక్ష పెరగడంతో పెద్దలు దండించారు. తన సమ వయస్కుడైన మేనమామ పోలిపెద్ది సత్యనారాయణతో సంప్రదించి, పెద్దవారికి తెలియకుండా యిద్దరూ విజయవాడ చేరుకున్నారు.

అప్పటికే మైలవరం జమీందారులలో రెండవవారైన సూరానేని పాపయారావుగారు కొన్నాళ్లు తమ స్వగ్రామం మైలవరంలోనే బాలభారతి సమాజాన్ని స్థాపించి రెండేళ్ల పాటు నడిపి, అక్కడి కన్న ఎక్కువ సౌకర్యంగా ఉంటుందని సమాజాన్ని విజయవాడకు మార్చారు. గోపాలం, సత్యనారాయణలు సరాసరి మైలవరం కంపెనీ చేరి తమ విద్యను ప్రదర్శించి అక్కడ చిన్నచిన్న వేషాలు వేసే పనిలో నియోగింపబడ్డారు. ఆ సమాజానికి 'సావిత్రి' నాటకకర్త శ్రీరాముల సచ్చిదానందశాస్త్రిగారు వాచిక నిర్ణేత. సంగీత దర్శకుడు పాపట్ల కాంతయ్యగారు. ఆ కంపెనీలో ఉద్యోగం దొరకడంతో సంబరపడిపోయాడు గోపాలం.

ఈ సమాజంలో గోపాలం తొలిపాత్ర 'శాకుంతలం'లో కణ్వుని శిష్యుడు పాత్ర. ఆ శార్ఙరవుని పాత్రలో గోపాలం ఎంతగా రాణించాడంటే తరువాతి నాటకం 'పాదుకాపట్టాభిషేకం'లో భరతుని పాత్రకు ఆయనను నిశ్చయించేటంత. ఆ నాటకంలో గోపాలం నటన అత్యుత్తమ స్థాయిలో నిరూపించబడ్డది. కైకమీద కోపగించే భరతుడు ఆ కోపాన్ని బయటకు రాకుండా జాగ్రత్త పడుతూనే, తల్లి మీద అణుచుకున్న అతని కోపాన్ని వ్యక్తీకరిస్తాడు. "నాకీ రాజ్యము కావలెనంటినటే, ఎన్నడయిన నీతో...' అనే కీర్తన పాడుతూ 'గోముఖవ్యాఘ్రమా' అన్న చోట గొంతు తగ్గించి, పండ్లు బిగించి చెప్పడం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.

ఇంతలో బాలభారతి దర్శకులు మారారు. శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రిగారి స్థానంలో ద్రౌపదీ వస్త్రాపహరణ రచయిత మల్లాది అచ్యుతరామశాస్త్రిగారు నియోగించబడ్డారు. ఈ శాస్త్రిగారు గొప్ప పండితుడు. సహజ చమత్కారి. 'ద్రౌపదీ వస్త్రాపహరణం'లో ఎన్నో పాత్రలున్నా గోపాలంగారి కిచ్చిన పాత్ర విదురుడు. మహాభారతంలో విదురుని పాత్ర శాంతరసానికి పరాకాష్ట. చాలా నిబ్బరంగా చేయవలసిన పాత్ర. రంగస్థలం మధ్య గోపాలం ఆ పాత్ర ధరించి నిలబడి "తగని పని నాయనా, నీకిది" అని చెప్పే నీతి వాక్యాలకు ప్రేక్షకుల కరతాళ ధ్వనులు మోగేవి.

ఇంతలో బాలభారతి సమాజాన్ని మూసి వేయవలసిన అగత్యం ఏర్పడ్డది. ఎవరి దారి వారు చూసుకోవలసిన స్థితి. అప్పటికే శాస్త్రిగారు వ్రాసి వుంచిన "సతీ సక్కుబాయి" నాటకాన్ని గోపాలంగారి కిచ్చి దానిని వీలుంటే ప్రదర్శించమన్నారు. గోపాలంగారు జొన్నవిత్తుల శేషగిరిరావు, తుంగల చలపతి, జొన్నవిత్తుల సత్యనారాయణ, సూరవరపు వెంకటేశ్వర్లు ప్రభృతులను ఎంచుకొని ఒక సంవత్సరం పాటు ఖర్చునంతా తానే భరించి నాటకాన్ని ప్రదర్శన యోగ్యంగా తీర్చిదిద్దాడు. దాని కోసం కీర్తనలు వ్రాశాడు. నాటక ప్రారంభంలోనే సక్కుబాయి పాడే "ఆటలాడుకోరా, గోపాలా, నా ముద్దుల మూటవు గదరా" అనే పాట ప్రేక్షకుల్ని ముగ్ధుల్ని చేసేది. గోపాలం శివయోగి పాత్రను ధరించాడు. జొన్నవిత్తుల సంగీత గరిమ, సక్కుబాయి భక్తి ప్రపత్తులు, యోగి భావ శబలత నాటకానికి మూలకందమై కొన్ని సంవత్సరాలు తెలుగు నాటక రంగం మీద పట్టాభిషిక్త అయింది. కాని నటులలో భేదాభిప్రాయాలు కారణంగా సంస్థ మూసివేయడం జరిగింది. గోపాలం గారు మాత్రం అప్పుల ఊబిలో దిగి పోయారు.

ఆ ఆవేదనతోనే గోపాలంగారు కీర్తిశేషుడైనాడు. ◆

'ఆంధ్ర గంధర్వ'

# జొన్నవిత్తుల శేషగిరిరావు



**20**వ శతాబ్దపు తొలిదినాలలో నాటక ప్రదర్శనలలో సంగీతానికి ప్రాముఖ్యం పెరుగుతూ వచ్చింది. మహారాష్ట్ర నుంచి, ఉత్తర దేశం నుంచి నాటక కంపెనీలు ఆంధ్రదేశం పర్యటించి తమ సంగీత, నటనా సామర్థ్యంతో తెలుగు ప్రేక్షకులను ఉత్తేజ పరుస్తున్న రోజులవి. మన నటులు కూడా ఔత్తరాహుల సంగీత సంప్రదాయాలను అవగాహన చేసుకుని, హిందూస్థానీ రాగఫణితుల్ని మన నాటకాలలో జొప్పించి అటు తెలుగువారుకాని ప్రేక్షకులకు, యిటు తెలుగు ప్రేక్షకులకు కూడా వీనులవిందు చేశారు. అట్టి వారిలో హిందూస్థానీ సంగీత పాటకులను కూడా తన సమ్మోహన గానంతో ఆశ్చర్యచకితుల్ని చేసి, తన నటనావైదుష్యంతో తెలుగువారి గౌరవ సమ్మానాలనందుకున్న అతికొద్ది మంది నటులలో జొన్నవిత్తుల శేషగిరిరావుగారిని ప్రప్రథమంగా పేర్కొనవలసి వుంది.

జొన్నవిత్తుల 1905లో కృష్ణాజిల్లా మంటాడకు సమీపంగా ఉన్న శాయిపుర అగ్రహారంలో జన్మించారు. చిన్నతనంలోనే దైవదత్తమైన గానమాధుర్యం అలవడి, అధ్యాత్మ రామాయణ కీర్తనలు, రామదాసు కీర్తనలు ఆలపిస్తూ భక్తులను తన్మయత్వంలో ముంచెత్తే వాడు. 13 సంవత్సరాల వయసులో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బెజవాడ చేరుకున్నాడు. మైలవరం రాజాగారి బాలభారతి ప్రాంగణం



పక్కనే నిలబడి కూనిరాగాలు తీసుకుంటున్న శేషగిరిని రిహార్సలు పూర్తయి అటువెడుతున్న యడవల్లి సూర్యనారాయణగారు చూడడం వినడం జరిగింది. వెనకకు తిరిగి వచ్చి వివరాలడిగి తెలుసుకున్నాడు. ఆ పిల్లవాడు తనది శాయపురం అనీ, ఊరు చూద్దామని వచ్చాననీ రేపు తిరిగి తమ ఊరు వెళ్లిపోతాననీ చెప్పాడు. పిల్లవాడు దబ్బపండు చాయ, మెలికలు తిరిగిన గిరజాల జుట్టు. కంఠంలో అనిర్వచనీయమైన మాధుర్యం. మర్నాడు ఆ పిల్లవాడిని రాజాగారి ముందుకు తీసుకువెళ్లాడు యడవల్లి. పాడివినిపించమన్నాడు. ఆ పిల్లవాడి గానం విన్న రాజాగారు, మహామహులైన ఆ సంస్థ నటులూ తన్మయులై పోయారు. ఆ చిన్న పిల్లవాడు నెలకు 40రూ. జీతంతో బాలభారతిలో సభ్యుడైనాడు. హేమాహేమీలందరితోను కలిసి నాటకాలాడాడు. అందరి సరసన ఏ మాత్రం తీసిపోకుండా నటించాడు. జొన్నవిత్తుల పాట ప్రేక్షకులకు ఒక ఉత్తేజం, ఒక మేలుకొలుపు, ఒక జోలపాట. ఆ పసివాడి గొంతులో పలికే మధురిమలలో ఎన్ని ఉద్వేగాల సోయగాలో!

మైలవరం సమాజంలో ప్రహ్లాదుడు, కృష్ణుడు పాత్రలతో నట జీవితం ప్రారంభించిన శేషగిరిరావు అచిరకాలంలోనే ముఖ్యమైన వేషాలు ధరించడం ప్రారంభించాడు. ‘సావిత్రి’, ‘ద్రౌపదీ వస్త్రాపహరణం’, ‘కృష్ణలీలలు’, ‘శకుంతల’, ‘తులాభారం’ నాటకాలలో యడవల్లి స్థానంలో నాయక వేషాలు వేశాడు. జొన్నవిత్తుల ఆనాటి నటులందరిలోను ప్రత్యేకంగా కనిపించేవాడు. దానికి మొదటి కారణం ఆయన ముఖ వర్చస్సు. రెండవకారణం ఆయన గాత్ర సౌష్టవం. కర్ణాటక, హిందూస్థానీ రాగాలలో అనర్గళంగా పాడగల ఆయన ప్రతిభ. పాటకు దీటుగా నటన.

శేషగిరిరావు బాలభారతి చివరిరోజులలో అందులో చేరినవాడు. దాని ప్రాచుర్యం క్షీణించగానే తాను స్వయంగా గంధర్వ నాట్యమండలిని స్థాపించి 'సక్కుబాయి', 'రాధాకృష్ణ', 'శాకుంతలం', 'రామదాసు' నాటకాలను ప్రదర్శించాడు. 'రాధాకృష్ణ'లో పారుపల్లి సుబ్బారావుగారు రాధ వేషం వేస్తే జొన్నవిత్తుల కృష్ణుడు వేషం వేసేవాడు. ఆ నాటకంతో దేశమంతా సంచారం చేశారు ఆ యిద్దరూ.

జొన్నవిత్తుల ప్రతిభను తెలుసుకున్న గ్రామఫోను కంపెనీలు 1930లో ఆయన పాటలను రికార్డులుగా తీసుకొని వచ్చారు. శేషగిరిరావు గానవైదుష్యాన్ని తెలుగు మిత్రుల ద్వారా విన్న మహారాష్ట్ర గాయక-నటుడు బాలగంధర్వ ఆయనను కలిసి, పాట విని తమ సమాజంలో చేరవలసిందిగా ఆహ్వానించారు. ఆయన సున్నితంగా తిరస్కరించాడు. ఆయనే జొన్నవిత్తులను "ఆంధ్రగంధర్వ" అని అభినందించాడు.

శేషగిరిరావు అభిమాన రాగాలు తోడి, శహన, శంకరాభరణం, కేదారగౌళ, సురటి, శ్రీరాగం, కాంభోజి. హిందూస్థానీ రాగాలలో భీంపలాస్, సోహనీ, కళింగ భాగేశ్వరీ, తోడి మొదలైనవి. వీటిని సంపూర్ణంగా సాధన చేసి ఎంతో నేర్పుగా పాడేవాడు. మహారాష్ట్ర గాయకులైన బాలగంధర్వ, మాస్టర్ కృష్ణ, నారాయణరావు వ్యాస్, పట్వర్ధన్‌ల గానం ఆయనకు యిష్టంగా ఉండేది. వారి పాటలు విని నిరంతరం సాధన చేసేవాడు.

శేషగిరిరావు గానం హెచ్చుస్థాయిలో వుండి మైకులు లేని ఆ రోజుల్లో ఎంత దూరానికైనా ఖంగున వినిపించేది. సంగీతం తెలిసిన వారినీ తెలియని వారినీ కూడా రసప్రవాహంలో ముంచెత్తేది.

శేషగిరిరావుకు కర్ణాటక సంగీతంలో కూడా అంతే విద్వత్తు ఉండేది. మహావిద్వాంసులైన కోనేరి రాజాపురం వైద్యనాథ అయ్యర్, తిరుచి గోవిందస్వామి పిళ్లె, నాదస్వర విద్వాంసుడు మధుర పొన్నుస్వామి పిళ్లెల వంటి వారి ఎదుట గంటల కొలది రాగాలాపన చేసి వారిని మెప్పించిన ప్రజ్ఞావంతుడాయన. కృష్ణకర్ణామృత శ్లోకాలను అయిదారు రాగాలతో రాగమాలికలుగా పాడితే గాయకులు, నటులు, పండితులు, పామరులు ఆనందంతో పొంగి పోయేవారట!

శేషగిరిరావు 'శకుంతల'లో దుష్యంతుడు, 'సావిత్రి'లో సత్యవంతుడు, 'ద్రౌపదీ వస్త్రాపహరణం', 'రాధాకృష్ణ', 'తులాభారం', 'సక్కుబాయి' నాటకాలలో కృష్ణుడు పాత్రలు ధరించి పాడిన అమోఘమైన పాటలను విన్న ఆనాటి ప్రేక్షకులు తిరిగి తిరిగి ఆయన చేత పాడించుకుని విని తన్మయులైనారు.

ఆ గాన గంధర్వుడు అతి పిన్న వయసులో - 1937 మార్చిలో - మరణించడం భావోద్దీప్తమైన తెలుగు సంగీతానికి, ఒక అపూర్వమైన గాన సరణికి తీరనిలోటు.◆

'నాట్యకళా విశారద'

# పసుపులేటి కన్నాంబ



మూడు దశాబ్దాలకుపైగా మూడు విభిన్న భాషా చిత్రసీమలలో ధర్మపత్నిగా, సహోదరిగా, మాతృమూర్తిగా, గయ్యాళి అత్తగా, మనసున్న తోడికోడలుగా, పట్టమహిషిగా, పేదరాలుగా విభిన్న మనస్తత్వాలు, అంతస్థులు కలిగిన పాత్రలలో విశిష్టమైన నటనా వైదుష్యాన్ని వెలువరించి ఆంధ్ర ప్రేక్షకుల హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకొన్న నటీమణి 'నాట్య కళావిశారద' పసుపులేటి కన్నాంబ.

1913 సెప్టెంబరు 20వ తేదీన ఏలూరులో జన్మించిన కన్నాంబ చిన్నతనం నుంచీ సంగీత, నాట్యాలకు జీవితం అంకితం చేసింది. పదమూడవ ఏట ఏలూరులోని నాటక సమాజంలో చేరి విభిన్నమైన పాత్రలు ధరించింది. కొంచెం వయసు రాగానే 'సత్య హరిశ్చంద్ర', 'సతీ సావిత్రి', 'రంగూన్ రౌడీ' నాటకాలను ప్రదర్శించి తన నటనా చాతుర్యాన్ని చాటింది. దొమ్మేటి సూర్యనారాయణతో కలిసి 'రంగూన్ రౌడీ' నాటకాన్ని ఆంధ్రదేశం నలుమూలలా కొన్ని వందల సార్లు ప్రదర్శించింది.

నిండైన మూర్తి, విస్పష్టమైన వాక్కు, గానమాధుర్యం - యీ మూడింటి సంగమం ఆమె నటనావిష్కారం. ఒక ప్రక్క నాటక ప్రదర్శనలిస్తూనే ఆమె ఎన్నో గ్రామఫోను రికార్డులిచ్చారు. చలన చిత్ర ప్రవేశం చేసిన తొలిరోజుల్లోనే చండికలో ఆమె పాడిన "నేనే రాణినైతే, ఏలనే యీధర ఏకధాటిగా", "ఏమే ఓ కోయిలా", "ఆనందమాయెనహా", "అక్షయలింగవిభో" వంటి పాటలు అశేషమైన జనాదరణ పొందాయి.

1935లో స్టార్ కంబైన్స్‌వారి 'హరిశ్చంద్ర'లో చంద్రమతిగా ఆమె సినిమారంగ

ప్రవేశం జరిగింది. ఆ పాత్రలో ఆమె మరుపురాని నటన ప్రదర్శించి తెలుగు చలనచిత్ర సీమలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నది. ఆమె చివరి చిత్రం భరణీ వారి "వివాహబంధం". మూడు దశాబ్దాల యీ మధ్యకాలంలో ఆమె తెలుగు, తమిళం, కన్నడ భాషలలో దాదాపు 150 పౌరాణిక, చారిత్రక, జానపద, సాంఘిక చిత్రాలలో నటించింది. రౌద్ర, కరుణ రసాలు పోషించడంలో కన్నాంబది అందెవేసిన చేయి.

'ద్రౌపదీ వస్త్రాపహరణం'లో ద్రౌపది పాత్రతో ఆమె కళా కౌశలం జనామోదం పొందింది. ఆ తరువాత ఆమె 'పాదుక', 'మాయామచ్ఛీంద్ర', 'పల్నాటియుద్ధం', 'అనార్కలీ', 'ముగ్గురు మరాఠీలు', 'గృహలక్ష్మి', 'దక్షయజ్ఞం', 'ధర్మపత్ని', 'నవజీవనం', 'జగదేకవీరునికథ', 'సతీ సక్కుబాయి', 'మాంగల్యబలం', 'అభిమానం', 'జల్సారాయుడు', 'ఆత్మబంధువు', 'లవకుశ', 'ఆత్మబలం' మొదలైన సినిమాలలో వైవిధ్యభరితమైన పాత్రలను ధరించి ప్రేక్షకుల మెప్పుపొందారు. సినిమా బాగా ఆడకపోవచ్చును గాని ఆమె నటన బాగుండలేదని ఏ ఒక్క ప్రేక్షకుడు, ఏ ఒక్క సినిమాను గురించి చెప్పకపోవడమే నటనలో పాత్రపోషణలో ఆమె నిర్దుష్టతకు తార్కాణం. అలాగే తెలుగు, తమిళ, కన్నడ సినిమారంగంలో ముఖ్యమైన నటులందరి సరసన ఆమె నటించింది.

సినీ నిర్మాత కడారు నాగభూషణంగారిని వివాహం చేసుకొని, 1940లో శ్రీరాజరాజేశ్వరి పిక్చర్స్ అన్న సంస్థను ప్రారంభించి ఎన్నో విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. ఈ సంస్థ నిర్మించిన "నవజీవనం" చిత్రాన్ని 1949లో ఉత్తమ చిత్రంగా ఎన్నికకాగా, మద్రాసు ప్రభుత్వం ఆ దంపతులను ఘనంగా సత్కరించింది. అదే సంవత్సరం ఆంధ్రనాటక కళా పరిషత్తు సన్మానాన్ని కూడా అందుకున్నారు.

1947వ సంవత్సరంలో పి.వి.పతిగారి అండదండలతో ఏ.కె.చెట్టియార్ గారు నిర్మించిన 'మహాత్మా గాంధీ జీవితం' చిత్రం బహుళ ప్రశంసలనందుకొన్నది. అందులో ఆమె పాటలు జనామోదం పొందాయి.

శ్రీమతి కన్నాంబ నిజజీవితంలో చాలా నిగర్వి. నటనలో అఖండమైన కీర్తిని, సంపదను ఆర్జించినా ఆమె ప్రవర్తనలో ఎటువంటి దర్పం, అహంభావం కనిపించేవి కాదు.

ఆమె 1964 మే 7వ తేదీన మద్రాసులో పరమపదించినప్పుడు సినిమా నాటకరంగాల ప్రముఖులు, సామాన్య ప్రజలు ఆమెకు యిచ్చిన నివాళి నటిగా ప్రజల గుండెలలో ఆమెకున్న సముచిత స్థానాన్ని మరొక్కసారి గుర్తుకు తెచ్చింది. ◆

'అమరగాయకుడు'

# పారుపల్లి సత్యనారాయణ



సంగీతం నాటకరంగాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుతున్న రోజుల్లో నాటకరంగ ప్రవేశం చేసిన పారుపల్లి సత్యనారాయణ రంగస్థల నటులే సినిమారంగాన్ని ఏలే రోజుల్లో సినిమాలలో ప్రవేశించి తన గానంతో ఆనాటి ప్రేక్షకుల్ని తన్మయులను చేశాడు.

పారుపల్లి 1906లో కృష్ణాజిల్లా దివిసీమలో జన్మించారు. లక్ష్మీనారాయణ, సీతమ్మగార్లు తల్లిదండ్రులు. సంగీతానికి ఆలవాలమయిన వంశం వారిది. గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య యీ కుటుంబానికి దగ్గరి బంధువు. అన్నగారు పారుపల్లి సుబ్బారావు ప్రఖ్యాత రంగస్థల స్త్రీ వేషధారి. తన స్త్రీ వేషధారణతో ముఖ్యంగా 'రాధాకృష్ణ'లో రాధగా యావదాంధ్రను అలరించిన సుబ్బారావుగారు సత్యనారాయణ అన్నగారు. సంగీతం అంతో యింతో నేర్చుకోగానే రంగస్థల నటులు కావడం ఆనాటి ఆచారం. అటువంటి గాయకులను మురిపించి, లాలించి, ఆశలు చూపి తమ వృత్తి నాటక సమాజాలలో చేర్చుకొనే వారు ఆనాటి సమాజాధిపతులు. సత్యనారాయణకూడా నాటకాలలో పాల్గొనడం ప్రారంభించాడు. నాటకాలులో వేస్తే తనతో ఉండనక్కరలేదన్నాడు తండ్రి. అయినా, అన్నగారి సలహామేరకు బందరులోని బాల

భరత సంఘంలో చేరి స్త్రీ పాత్రలు ధరించడం ప్రారంభించాడు. నాలుగైదు సంవత్సరాల తరువాత తెనాలి ఫస్టుకంపెనీ (శ్రీకృష్ణ హిందూ థియేటర్)లో ప్రధానమైన నటుడై మల్లాది గోవిందశాస్త్రి, వేమూరి గగ్గయ్య వంటి ప్రముఖులతో 'ద్రౌపదీ వస్త్రాపహరణం'లో ద్రౌపది, 'సతీతులసి'లో తులసి, 'రంగూన్‌రౌడి'లో అన్నపూర్ణ పాత్రలను ధరించి పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు.

నాటకంలో పేరు ప్రఖ్యాతులు రావడం సినిమారంగానికి చేరడానికి ముఖ్యమైన మెట్టు అయిన ఆ రోజుల్లో సత్యనారాయణకు సినిమారంగం నుంచి **1933**లో పిలుపు వచ్చింది. 'సావిత్రి' చిత్రంలో నారదుడుగా వెండితెరకు పరిచయం అయిన పారుపల్లి వెంటవెంటనే 'లవకుశ', 'కృష్ణలీలలు' సినిమాలలో నటించి ఆంధ్ర ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొన్నారు. ఆనాటి సినిమాలలో అత్యధికంగా ధనాకర్షణ చేసిన సినిమాలు ఆ మూడే!

ఈస్టిండియా కంపెనీ వారి 'సతీ సావిత్రి'లో సత్యనారాయణ నారదపాత్రను ధరించి "సుజన జనావనా మధుసూదనా" అన్న పాట పాడి ప్రేక్షకులను అలరించాడు. అలాగే 'లవకుశ'లో వాల్మీకి మహర్షిగా నటించి పాడిన రెండు పాటలూ ("సత్యపాలనా...", "సాహసమేల") సర్వజనామోదాన్ని పొందాయి. ఆ తరువాత ఆయన 'పృధ్వీపుత్ర', 'సంపూర్ణ రామాయణం', 'విజయదశమి', 'దశావతారాలు', 'భీష్మ', 'విరాటపర్వం', 'మైరావణ', 'ప్రహ్లాద', 'పాదుక' మొదలైన చిత్రాలలో విభిన్నమైన పాత్రలను ప్రతిభావంతంగా నిర్వహించాడు.

ఆ సినిమా తొలి రోజుల్లో గగ్గయ్యగారి పాటల తరువాత ఆబాలగోపాలమూ పాడుకొనే పాటలు పారుపల్లివే!

అతి చిన్నవయసులోనే **1948**లో ఆయన మరణించడం గాయక-నట లోకానికి పెద్ద లోటు. ◆

'అభినవ త్యాగరాజు'

# చిత్తూరు వి.నాగయ్య



నటునిగా, దర్శకునిగా, మధుర గాయకునిగా, సంగీత దర్శకునిగా, నిర్మాతగా అన్నిటినీ మించి మానవత్వం పుంజీభూతమైన ఆదర్శమూర్తిగా తెలుగువారి హృదయాలలో తనకంటూ ఒక సుస్థిరమైన స్థానాన్ని నిర్మించుకొన్న సంస్తవనీయుడు చిత్తూరు వి.నాగయ్యగారు. ఆయన అసలు పేరు చిత్తూరు వుప్పలదడియం నాగేశ్వరం. నాగేశ్వరం పేరు నాగయ్యగా మారడాన్ని గురించి ఆయనే ఓ కథ చెప్పారు. ఆయన సినిమాల కోసం మద్రాసు చేరిన తొలినాళ్లలో తరుచు ఆంధ్రపత్రిక ఆఫీసుకు వెళ్లేవారట. ఆ పత్రికకు చిత్తూరు విలేకరిగా పని చేస్తూ వున్న చనువుతో మద్రాసులో తన అడ్రసును 'కేర్ ఆఫ్ ఆంధ్రపత్రిక' అని యిచ్చారట. ఆంధ్రపత్రిక యజమాని కాశీనాథుని నాగేశ్వరరావుగారు. నాగేశ్వరానికి వచ్చిన ఉత్తరాలు నాగేశ్వరరావుగారికి ఈయనకు వచ్చిన ఉత్తరాలు ఆయనకు యిచ్చేవారట! నాగయ్యను ఎరిగున్న చాలమంది ఆయనను 'నాగూ, నాగయ్య' అని పిలువడం విన్న ఆచంట రుక్మిణీ

లక్ష్మీపతిగారు "నీ పేరు నాగయ్య అని మార్చుకోరాదుటయ్యా!" అని సలహా చెప్పారట! ఆనాటి నుంచి ఆయన చిత్తూరు వి.నాగయ్య.

నాగయ్యగారు **1904**వ సంవత్సరం మార్చి **28**న గుంటూరు జిల్లా రేపల్లెలో జన్మించారు. తండ్రి రామలింగశర్మ; తల్లి లక్ష్మాంబ. నాలుగుకాన్పులు పోయిన తరువాత పుట్టిన బిడ్డ కావడంతో "పిల్లవాడిని నేను పెంచుతాను" అని పిల్లవాడి అమ్మమ్మ ఆ పసిగుడ్డును తీసుకొని ఆమె స్వగ్రామం చిత్తూరు జిల్లా కుప్పం దగ్గర వున్న గోగునూరు వచ్చింది. అక్కడే నాగయ్య తన ప్రాథమిక విద్య పూర్తి చేశాడు. తండ్రి రేపల్లెలో వున్న కొద్దిపాటి వుద్యోగం వదిలి పిల్లవాడి దగ్గరకు రావడంతో కుటుంబం కుప్పం చేరింది. కొన్నాళ్ల తరువాత తండ్రికి అక్కడ జీవిక కుదరకపోవడంతో అందరూ చిత్తూరు చేరారు.

నాగయ్య ఒకవైపు స్కూలుకు పోతూనే ఇంటి దగ్గర దైవదత్తమైన మధురకంఠంతో కూనిరాగాలు తీస్తూ వుండేవాడు. తమకు అండగా వుంటున్న చెంగమ నాయుడుగారు ఊళ్లో ప్రతి సంవత్సరం ఉత్సవాలు జరిపించేవారు. ఆ సంవత్సరం ఉత్సవాలకు సురభి నాటకాల వారిని పిలిపించారు. 'భక్త ప్రహ్లాద'లో ప్రహ్లాదుడి వేషం వేసే కుర్రవాడికి జ్వరంగా ఉండడంతో మూడు రోజులు నాటకం పడలేదు. నాయుడుగారు "పోనీ! మా అయ్యగారి అబ్బాయి వున్నాడు. పాడతాడు. అతని చేత వేయించండి" అన్నాడు. పిల్లవాడిని పిలిపించి పాడిస్తే అద్భుతంగా వుంది. ఆ రోజంతా పాటలు, పద్యాలు నేర్పి రాత్రికి వేషం కట్టించారు. నిద్రమత్తులో కొంచెం తడబడ్డా ఆ తరువాత బ్రహ్మాండంగా చేసి అందరి చేత 'భేష్' అనిపించుకున్నాడు.

అయితే నాటకాలంటే పిచ్చి ఎక్కువై చదువు దెబ్బతిన్నది. చుట్టుపక్కల ఎక్కడ నాటకం వున్నా వెళ్లితీరవలసిందే! ఈలోగా ఊళ్లో హార్మోనియంలు బాగుచేసే షాపువాడిని మచ్చిక చేసుకొని రోజూ రెండు మూడు గంటలు దాని మీద సాధన! ఈ సంరంభంలో నాగయ్య నాలుగవఫారం తప్పాడు. నాయుడుగారి సలహామీద పిల్లవాడిని తిరుపతి పంపారు. అక్కడ కూడా చదువుకు బదులు నాటకాలు ఎక్కువ కావడంతో తండ్రి తిరిగి చిత్తూరు తీసుకొని వచ్చి, ట్రయినింగ్ స్కూలులో వేశాడు. అక్కడ చదివే రోజుల్లో ఆటపాటల్లో మేటి అనిపించుకున్నాడు. ఒక చిన్నపాటి వుద్యోగం దొరికింది. కాని చదువుకోవాలని మదనపల్లి దివ్యజ్ఞాన సమాజం స్కూలులో చేరాడు. అక్కడ పిల్లలను చేర్చి చిన్నచిన్న నాటికలు వేయించేవాడు. దివ్యజ్ఞాన సమాజం పెద్దలు - డా॥ అనిబిసెంట్, డాక్టర్ కజిన్స్ మొదలైన వారికి దగ్గరయ్యాడు. చిత్తూరులో ఆ రోజుల్లో రామవిలాససభ అనే నాటకసంస్థ చాలా ఉత్సాహంగా నాటకాలు వేస్తూ

ఉండేది. అందులో సభ్యుడై వారి భజన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడు. రామవిలాస సభ్యుల చొరవతో చిత్తూరులోనే జిల్లా బోర్డు ఆఫీసులో గుమాస్తా ఉద్యోగంలో కుదురుకొని నాటకాలలో పాల్గొంటూ వుండేవాడు. ఒకసారి "సారంగధర" నాటకంలో చిత్రాంగి పాత్ర ధరించే నటుడు రాకపోవడంతో పెద్దల బలవంతంతో నాగయ్యే ఆ వేషం వేయవలసి వచ్చింది.

రామవిలాససభ నాటకాలలో ఎక్కువగా స్త్రీ పాత్రలే ధరించాడు నాగయ్య. చిత్రాంగి, ఆషాబి, శకుంతల మొదలైనవి. ఎవరు స్త్రీ వేషాన్ని చక్కగా ధరించినా వారి నుంచి మెళుకువలు నేర్చుకొనేవాడు. రామదాసులో రామదాసు వేషం వేసి పండితుల మెప్పుపొందాడు. టాకీలు రాని ఆ రోజుల్లో గ్రామఫోను రికార్డులు వినడం వేలంవెర్రిగా వుండేది. బెంగుళూరులో హెచ్.ఎం.వి.కంపెనీ తెలుగు విభాగం అధిపతిగా కొప్పరపు సుబ్బారావుగారు నియమితులయ్యారు. ఆయన కోరిక మేరకు రామవిలాస సభ తమ "విశ్వామిత్ర" నాటకాన్ని రికార్డులుగా యిచ్చింది. సినిమాలలో చేరిన తర్వాత నాగయ్య ఎన్నో ప్రయివేట్ రికార్డులు యిచ్చారు. జాతీయోద్యమం ఉధృతంగా వున్న రోజుల్లో నాగయ్య ఉద్యమంలో చేరాడు. ప్రతి సభలోనూ దేశభక్తి గీతాలు పాడేవాడు.

చిత్తూరులో ఉద్యోగం మాని సినిమాలలో చేరే ప్రయత్నాలు చేయడానికి మదరాసు చేరుకున్నాడు నాగయ్యగారు. 1936లో రోహిణీ పిక్చర్స్ సంస్థ తీస్తున్న 'గృహలక్ష్మి' సినిమాలో గోపీనాథ్ అన్న దేశభక్తుడి వేషం దొరికింది. ఆ చిత్రం విజయవంతం కావడంతో అందులో కొందరు చేరి వాహినీ పిక్చర్స్ ప్రారంభించారు. ఆ సంస్థ తీసిన "వందేమాతరం" సినిమాలో నాగయ్యే నాయకుడు. ఆ చిత్రం గొప్ప విజయం సాధించింది. ఆ తరువాత నాగయ్యగారు ఆంధ్రదేశం గర్వించదగ్గ సాంస్కృతిక నాయకుల సినిమాలలో వేషాలు వెయ్యడం మొదలుపెట్టారు. అందులో మొదటిది భక్త పోతన. తరువాత 'త్యాగయ్య'. తీరా 'త్యాగయ్య' మొదలు పెడుతూవుండగా ఆ సంస్థ పెద్దలంతా నాగయ్య గారినే దర్శకత్వం వహించమన్నారు. ఆ విధంగా 'త్యాగయ్య', 'రామదాసు' సినిమాలకు నాగయ్యే దర్శకుడు. 'రామదాసు' తప్ప మిగిలిన సినిమాలకు కీర్తి, ఆర్థిక పుష్టి - రెండూ లభించాయి. 'త్యాగయ్య' సినిమాకు లభించిన కీర్తి ప్రతిష్టలు 'నభూతో...' అని చెప్పవచ్చు. దక్షిణ దేశంలో నాగయ్య అభినయ మూర్ధన్యుడైనాడు. 'సుమంగళి'లో వేసిన వృద్ధుని వేషంలో కూడా నాగయ్య రాణించడంతో ఆయనను "పాల్ మునీ ఆఫ్ ఇండియా" అని కీర్తించింది 'ఫిల్మ్ ఇండియా' అనే పత్రిక.

నటనతోపాటు నాగయ్యగారు సంగీత దర్శకత్వంలో కూడా ఎనలేని ఖ్యాతి

సంపాదించారు. 'వందేమాతరం'తో ప్రారంభమైన ఆయన సంగీత దర్శకత్వం 'సుమంగళి', 'దేవత', భక్త పోతన', 'త్యాగయ్య' వంటి సినిమాలవరకు కొనసాగింది. కొన్ని సినిమాలకు నాగయ్యతో పాటు ఓగిరాల కూడా సంగీతం చేశారు. 'ఇల్లాలు', 'దేవత', 'యోగి వేమన', 'భక్త పోతన', 'స్వర్గసీమ', 'బీదలపాట్లు' చిత్రాలలో ఆయన నటన ఎంత ప్రతిభావంతంగా వుందో, ఆయన 'దేవత', 'భక్త పోతన', 'త్యాగయ్య', 'యోగి వేమన' సినిమాలకు యిచ్చిన సంగీతం కూడా అంత ప్రతిభావంతంగా వుంది. చాలా పాటలు ఈనాటికి కూడా శ్రోతలను అలరిస్తూనే వున్నాయి. దానికి కారణం ఆ పాటలలో వినిపించే పాత్రల భావోద్వేగం. అప్పటి వరకు సినిమా పాటలకు వేరే అస్తిత్వం ఉండేది. సినిమాలకు అందులోని పాటలకు ఏకత్వభావన ఉండేది కాదు. నాగయ్యగారు పాటకు పాత్రకు, భావానికి అనుభూతికి అటువంటి వంతెన కట్టారు. తెలుగు పాటలలో భావోద్విగ్నత ఆయన పాడిన, చేసిన పాటలతోనే మొదలైందని చెప్పవచ్చు.

నాగయ్యగారు స్వయంగా రేణుకా పిక్చర్స్ సంస్థను ప్రారంభించి చిత్ర నిర్మాణానికి కూడా పూనుకున్నారు. ఆయన ఎన్నో గుప్తదానాలు చేశారు. పేదలకు పెళ్లిళ్లు చేశారు. దానధర్మాలు చేయడంలో ఆయనకు ఆయనే సాటి. అది ఆయన తుది రోజులలో చెరుపు తెచ్చినా నవ్వుతూ ఆ విషయాలను పట్టించుకొనే వారు కాదు. ఆయనకు జరిగినన్ని సన్మానాలు ఆ రోజుల్లో ఏ నటుడికీ జరగలేదు. తిరువాన్కూర్ మహారాజు నిండుకొలువులో ఆయన పాదాలు కడిగి ఆయనకు "అభినవ త్యాగరాజు" బిరుదు నిచ్చారు. మైసూరు మహారాజు సకల రాచమర్యాదలతో గౌరవించారు. ఊరూరా ఆయనకు కనకాభిషేకాలు చేశారు. ఊరేగింపుల్లో ఇంటింటి దగ్గర ఆపి హారతులు యిచ్చారు.

నటునిగా, దర్శకునిగా, గాయకునిగా, సంగీత దర్శకునిగా నాగయ్యగారు చూపిన ప్రతిభా విజ్ఞతలు ఆయనకు మహానటునిగా, ఉత్తమ గాయకునిగా గుర్తింపు తెచ్చాయి. నిజజీవితంలో ఆయన తోటివారిని అమాయకంగా నమ్మి మోసపోయారు. జీవితం చివరి వరకు సినిమాలలో చిన్న, పెద్ద పాత్రలు ధరిస్తూ ఆయన 1973 డిసెంబరు 30వ తేదీన శాశ్వతంగా కన్ను మూశారు. ఆయన దూరమైనా ఆయన తెలుగువారికి వదిలిపోయిన అపూర్వ సాంస్కృతిక సంపద ఆయన చలనచిత్రాలు, ఆయన మూర్తి కట్టించిన ఆ పోతన, త్యాగయ్య, వేమన, రామదాసుల పాత్రలు, ఆ సినిమాలకు ఆయన కట్టిన బాణీలు, ఆయన పాడిన పాటలు - ఇవి అన్నీ తెలుగు వారి గుండెల్లో పదిలంగా దాచుకొన్న జ్ఞాపకాల పారిజాతాలు. అందుకు జాతి ఆయనకు ఎప్పుడూ రుణపడి వుంటుంది. ◆

'సహజనట'

# ఆరణి సత్యనారాయణ



స్త్రీ పురుష వేషాలు రెంటినీ సమానమైన సమర్థతతో నిర్వహించిన ప్రజ్ఞాశాలి, సినిమా నాటకరంగాలలో సమానమైన ప్రతిభా వ్యుత్పత్తులను కనబరిచిన మేటి నటుడు ఆరణి సత్యనారాయణ. 20వ శతాబ్దం రెండో దశకంలో నాటకాల పోటీలు (ఒకేనాటకాన్ని పలు సంస్థలు ఆడే పోటీలు) విపరీతంగా జరిగే రోజుల్లో తాను ఏ పోటీకి వెళ్లినా సువర్ణ పతకాలను సాధించిన నటధీమణి ఆరణి.

ఆరణి సత్యనారాయణ గుంటూరు సంగడి గుంటలో 1898వ సంవత్సరం నవంబరు 11వ తేదీన జన్మించారు. బాల్యం నుంచీ వీధి నాటకాలు, జంగంకథలు, తోలు బొమ్మలాటలు వంటి సంప్రదాయ కళారూపాలమీద ఆసక్తి చూపించేవారు. రాత్రంతా వీధి నాటకం చూసి మరునాడు ఉదయం స్నేహితుల సమక్షంలో ఆ ఘట్టాలను ఆ విధంగానే ప్రదర్శించేవాడు. 1912లో - తన 14వ ఏట - బెల్లంకొండ సుబ్బారావుగారి ప్రోత్సాహంతో 'గయోపాఖ్యానం'లో సత్యభామ వేషం ధరించాడు. చదువుకు ఆటంకం వస్తుందని తల్లిదండ్రులు కట్టడి చేసినా లాభం లేకపోవడంతో, ఆరణి గుంటూరు స్టార్ థియేటర్‌లో చేరి ఆడవేషాలు వేయడం ప్రారంభించారు. ఇంతలో మూన్ థియేటర్‌లో ప్రధాన భూమికలు ధరించే బండారు రామస్వామిగారి ఆహ్వానం రావడంతో ఆయన పక్కన ప్రధాన స్త్రీ పాత్రలు ధరించారు. ఆ తరువాత కొంతకాలం ప్లీడరు గుమాస్తాల నాటక సంఘంలోను, గుంటూరు ఫస్టు కంపెనీలో హరి ప్రసాదరావుగారి పక్కన చంద్రమతి వంటి పాత్రలు ధరించి నటలోకం మెప్పును ప్రేక్షకుల ఆదరాభిమానాలను పొందారు.

1917లో గుంటూరు, విజయవాడలలో జరిగిన 'హరిశ్చంద్ర' నాటక పోటీలలో చంద్రమతి పాత్రకు సువర్ణ పతాకాలను గెలుచుకున్నారు. 1918లో ఏలూరులో 'ప్రసన్నయాదవ' నాటకపోటీలో ఊర్వశి పాత్రకు సువర్ణపతకం సాధించారు. దీనితో ఆరణి పేరు ప్రఖ్యాతులు పెద్దలకు కూడా తెలియడంతో ఏలూరులోని ప్రఖ్యాత

సీతారామాంజనేయ నాటక సమాజ (దీనిని 'మోతేవారి కంపెనీ' అనేవారు) అధినేత మోతే నారాయణరావుగారి ఆహ్వానంతో ఆ సంస్థలో నటుడుగా చేరారు. అక్కడ వుండగానే అనేక ఉత్తమ నాటకాలలో ప్రధాన స్త్రీ, పురుష భూమికలు ధరించారు. ఇందులో ముఖ్యంగా పేర్కొనవలసిన పాత్రలు - సత్యభామ, ఊర్వశి, దమయంతి, యామినీ పూర్ణతిలక, మల్లమదేవి, పద్మిని, ఇందిర, చంద్రమతి, వసంతసేన. మోతే వారి కంపెనీ ప్రదర్శించిన 'మృచ్ఛకటిక' నాటకంలో వసంత సేన పాత్ర ఆయనకు ఎనలేని కీర్తిని సాధించి పెట్టింది. విమర్శకాగ్రేసరులు శ్రీ పురాణం సూరిశాస్త్రిగారి ప్రత్యేక మన్ననలు పొందింది.

సీతారామాంజనేయ నాటక సమాజం నుంచి యడవల్లి సూర్యనారాయణ గారు వైదొలగడంతో ఆరణి కొన్ని ప్రధాన పురుష పాత్రలు ధరించడం ప్రారంభించారు. రామదాసు, సారంగధరుడు, రాముడు, కృష్ణుడు, సత్యవంతుడు, విదురుడు, కణ్వుడు, భరతుడు, నారదుడు వంటి పాత్రలలో రాణించారు. కొంతకాలం అల్లూరు సమాజంలో చేరి 'రామదాసు' నాటకంలో తాను రామదాసుగాను, అల్లూరు రామచంద్రారెడ్డిగారు కబీరు పాత్రలోను నటించి ఆంధ్రదేశం నలుమూలలా దిగ్విజయంగా ప్రదర్శనలిచ్చారు. అందగాడు, ఏ నాయక నాయికా వేషం వేసినా ఆ పాత్రలో యిమిడిపోగల సౌకుమార్య వర్చస్సులు గల ఆరణి సత్యనారాయణను 1921లో ఆర్.యస్.ప్రకాష్‌గారు మూకీ చిత్రాలలో ప్రవేశపెట్టారు. ఆ చిత్రాలలో విష్ణుమూర్తి, రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, కల్కి వంటి పాత్రలు ధరించిన ఆరణి తిరిగి నాటకరంగానికి వచ్చి కంట్రాక్టు నాటకాలలో నటిస్తూ 1933లో ఘంటసాల బలరామయ్యగారి ఆహ్వానంతో 'రామదాసు' చిత్రంలో రామదాసు పాత్రను ధరించారు. 1935లో బెజవాడ సరస్వతీ టాకీసు వారు నిర్మించిన "ద్రౌపదీ వస్త్రాపహరణం' చిత్రంలో విదురుడి పాత్రను ఉత్తమంగా నిర్వహించి మన్ననలు పొందారు. ఆ తరువాత 'కనకతార', 'బాలయోగిని', 'ధర్మాంగద', 'రత్నమాల', 'లైలామజ్ను' చిత్రాలలో వివిధ భూమికలు ధరించారు. 1950 నాటికి వినోదా పిక్చర్సులో అకౌంటెంట్‌గా పనిచేస్తూ వారు తీసిన 'శాంతి', 'దేవదాసు' చిత్రాలలో పాత్రధారణ చేశారు. 1957లో కొంతమంది మిత్రులతో కలిసి 'బభ్రువాహన' సినిమా తీయాలని సంకల్పించారు కాని కలిసి రాలేదు.

ఆరణి సత్యనారాయణ శాంత స్వభావుడు. నిరాడంబరజీవి. ఏనాడు పేరు ప్రతిష్టల కోసం పాకులాడక తన మనసుకు నచ్చిన పాత్రలను ధరిస్తూ ఆ పాత్రలకు న్యాయం చేయడమే ధ్యేయంగా పెట్టుకొని జీవితాన్ని సుఖశాంతులతో గడిపి వృద్ధాప్యంలో 1969 జులై 2వ తేదీన మదరాసులో స్వర్గస్థులయ్యారు. ◆

'నటకావతంస', 'నటశేఖర', 'నాటక కళాప్రపూర్ణ'

# స్థానం నరసింహారావు



తన అద్భుత నటనా వైదుష్యంతో తెలుగు నాటకకళామతల్లికి దివ్య నీరాజనాలిచ్చిన కళామూర్తి, పౌరాణిక, సాంఘిక, చారిత్రక నాటకాలలోని స్త్రీపాత్రలకు శాశ్వతత్వాన్ని కలగచేసిన ప్రజ్ఞా దురంధరుడు, ప్రభుత్వాల చేత, ప్రభుత్వాధినేతల చేత, సామాన్య ప్రజల చేత అనితరసాధ్యమైన గౌరవప్రపత్తుల నార్జించుకున్న పద్మశ్రీ బిరుదాంకితుడు స్థానం నరసింహారావు గుంటూరు జిల్లా బాపట్లలో 1902వ సంవత్సరం సెప్టెంబరు 23న జన్మించారు. తల్లి ఆదెమ్మగారు. తండ్రి హనుమంతరావుగారు. చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో మేనమామ కామరాజు వెంకటనారాయణ గారి ప్రాపకంలో పెరిగాడు స్థానం. స్కూలు ఫైనల్ వరకు చదివాడు. చిత్రలేఖనంలో స్వయం కృషితో కొంత సామర్థ్యం సంపాదించాడు.

నాటక పద్యాల మీద మోజుతో ప్రతిరోజూ తన మేనమామ నాటకాలు రిహార్సలు చేసే గదికి పోయి హార్మోనియంకు అనుగుణంగా పద్యాలు పాడుకొనే స్థానానికి 1920లో అనుకోకుండా ఆ ఊర్లో పెద్దలు ప్రదర్శించే 'హరిశ్చంద్ర' నాటకంలో చంద్రమతి పాత్రధారి రాకపోవడంతో ఆ పాత్రను ధరించవలసిన అవసరం ఏర్పడి, అదే నటనను వృత్తిగా స్వీకరించేటట్లు చేసింది. బాపట్లలో చంద్రమతి పాత్రలో ఆయన



**స్త్రీ పాత్రలో**

చూపిన కౌశలం తెనాలి వరకు పాకింది. తెనాలి ఫస్టు కంపెనీగా పిలవబడే శ్రీకృష్ణ హిందూ సమాజం 25రూ. నెలజీతం మీద ఆయనను సభ్యుడుగా చేర్చుకొన్నది. ఆ సమాజంలో పని చేసిన ఆరునెలలలో స్థానం యశోద, లీలావతి, మోహిని వేషాలు వేసి తన ఖ్యాతిని యినుమడింప చేసుకున్నాడు. ఇంతలో ప్రఖ్యాత నాటక సంస్థ రామవిలాస సభ నుంచి తమ సమాజంలోనికి రావలసిందిగా ఆహ్వానం అందడంతో స్థానం రామవిలాస సభ్యుడైనాడు. ఆ రోజులలో క్రమశిక్షణకు, ఉత్తమ నాటక ప్రదర్శనలకు, వినూత్న నటనా విధానాలకు రామవిలాస సభ అత్యుత్తమ నిదర్శనంగా ఉండేది. ప్రఖ్యాత నటులు గోవిందరాజుల సుబ్బారావు, మాధవపెద్ది, పెద్దిభొట్ల చలపతి, పిల్లలమర్రి సుందరరామయ్య ప్రభృతులు అందులో నటులు. సమాజ సూత్రధారి భాగవతుల కుమార రాజగోపాలం. దర్శకులు నాట్యవిశారదులు, మహాపండితులు త్రిపురారిభట్ల వీరరాఘవస్వామిగారు. వీరందరి సాహచర్యంలో స్థానం తన నటనా విధానానికి యింకా మెరుగులు దిద్దుకున్నాడు. మాధవపెద్ది శివాజీగా, స్థానం రోషనారగా 'రోషనార' నాటకాన్ని ప్రదర్శించి కీర్తి ప్రతిష్టలతో పాటు, ఆర్థిక విజయాలను కూడా సాధించింది రామవిలాస సభ. ఆ తరువాత సత్యభామగా, మధురవాణిగా, మురగా ఎన్నో విశిష్టమైన స్త్రీ పాత్రలను సర్వజనామోదంగా నటించాడు స్థానం. బిరుదులు, సన్మానాలు, స్వర్ణకంకణాలు, స్వర్ణ కిరీటాలు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు, పద్మశ్రీ బిరుదు ఒకదాని వెంట ఒకటి తరుముకుంటూ వచ్చి, ఆయనను వరించాయి.

ఇంతలో రామవిలాససభ కార్యక్రమాలను విరమించడంతో బయటకు వచ్చి

అనేక సంస్థలలో ప్రధాన భూమికలు ధరించాడు. యడవల్లి దుష్యంతుడుగా స్థానం శకుంతలగా శాకుంతలం నాటకాన్ని దేశం నలుమూలలా ప్రదర్శించారు. సి.యస్.ఆర్., కపిలవాయి, రఘురామయ్య, జొన్నవిత్తుల వంటి వారు కృష్ణుడుగా, స్థానం సత్యభామగా ప్రదర్శించిన శ్రీకృష్ణతులాభారం నాటకం ప్రేక్షకులకు రసాస్వాదనానుభవమే! అలాగే చింతామణి, రాణీసంయుక్త, యామినీ పూర్ణతిలక, సైరంధ్రి, విద్యాధరి, అనసూయ వంటి ఎన్నో వైవిధ్యంతో కూడిన పాత్రలలో నటించి 'నటకావతంస', 'నటశేఖర' బిరుదులు పొందారు. పరస్పరం విరుద్ధమైన చండిక, అనసూయ పాత్రలను, మురసైరంధ్రి పాత్రలను రోషనారా సత్యభామ చిత్రాంగి పాత్రలను ఎంతో స్ఫూర్తిదాయకంగా అర్థవంతంగా నటించి పండిత పామరుల చేత మెప్పుపొందారు.

రోషనారగా స్థానం చూపిన ప్రేమ రౌద్రరసాలు, చిత్రాంగిగా ఆ పాత్రకు ఆయన యిచ్చిన వినూత్నమైన వ్యాఖ్యానం, మధురవాణిగా ఆయన చూపిన చిద్విలాసం, సత్యభామగా "నే గీచిన గీటు", "మీరజాలగలడా సత్యాపతి" అని గర్వంతో ఆలపించే పాటలు, పద్యాలలో కనిపించే ఆభిజాత్యం, చిత్రాంగిగా "నా మాట వేదమంత్రముగాగ' అనే ఆత్మస్థైర్యంతో కూడుకున్న ఆధిపత్య భావన - ఇవి అన్నీ తెలుగు రసికలోకానికి ఒక వినూత్న రాసవిలాసాన్ని అందించాయి. ప్రతిపాత్రకూ స్థానం ప్రతిష్ఠించిన యీ వినూత్న వ్యాఖ్యానమే స్థానం కీర్తిప్రతిష్టలకు కారణం.

స్థానం దేశవిదేశాలలో తన నటనా ప్రాభవానికి పొందని సన్మానం లేదు. 1938లో రంగూన్ ఆంధ్రులు బంగరు కిరీటంతో గౌరవించారు. 1936లో నరసాపురం పౌరులు "నటకావతంస" బిరుదాన్ని యిచ్చారు. 1941లో అప్పటి గవర్నర్ సర్ ఆర్థర్ హోప్ చేత గౌరవం అందుకున్నారు. 1956లో రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా పద్మశ్రీ బిరుదును స్వీకరించారు. 1956లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. 1962లో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ 'నాటక కళాప్రపూర్ణ' బిరుదునిచ్చి సన్మానించింది. 1957 నుంచి ఆకాశవాణి హైదరాబాదులో నాటక ప్రయోక్తగా ఉండి ఎందరో నటులకు మార్గదర్శక సూత్రాలను అందించారు. 70 సంవత్సరాల వయసులో తన జీవితానుభవాలను రంగరించి "నటస్థానం" అన్న ఆత్మకథను వెలువరించారు.

తన నడకతో, చూపులతో, విలాసవిభ్రమాలతో ప్రేక్షకులను సమ్మోహితులను చేసిన స్థానం, సుమారు 50 సంవత్సరాలలో 2000 ప్రదర్శనలిచ్చి ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన స్థానం 1971 ఫిబ్రవరి 21వ తేదీన తెనాలిలో శాశ్వతంగా కన్ను మూశారు. ఒక మహోజ్జ్వల నటజీవితం ముగిసింది. ఆయన మరణంతో ఒక మహోత్కృష్టమైన నట సంప్రదాయం కూడా ముగిసింది. ◆

'అభినవ రాముడు'

# కొచ్చెర్లకోట సత్యనారాయణ



**చూ**డగానే, ఆకర్షించే ముఖవర్చస్సు, మాటలలో మార్దవ మాధుర్యాలు, పాటలో శ్రావ్యత, ముచ్చట గొలిపే మందహాసం, నిండైన విగ్రహం - ఇన్నీ కలబోసుకొన్న వ్యక్తిత్వం కొచ్చెర్లకోట సత్యనారాయణగారిది. పుట్టింది జమీందారీ కుటుంబంలో, పశ్చిమ గోదావరిజిల్లా ఊనగట్ల గ్రామంలో, **1916**వ సంవత్సరంలో. మాతామహులతో భీమడోలు చేరి అక్కడే బాల్యం అంతా గడిపారు.

చిన్ననాటి నుంచీ గ్రామఫోను ముందు కూర్చొని పాటలు వినడం, మననం చేసుకోవడం, పొలాల్లోకి పోయి బిగ్గరగా పాడుకోవడం అలవాటయింది ఆయనకి. రంగస్థల గాయక -నటులంటే ఎక్కడలేని మోజు ఉన్న ఆ రోజులలో ఆయనకు కూడా నాటకాలు వేయాలనే ధ్యాస ఎక్కువైంది. రాజమండ్రిలో నాల్గవఫారం చదువుతూ వుండగా ఆ చిన్నవాడి పాటను విన్న బండరాముడు అని పిలవబడే మాచిరాజు రామచంద్రమూర్తి తాను ప్రారంభించిన కేసరీ సమాజంలో చేర్చుకున్నారు. అయితే కుటుంబ అవసరాలతో ఆయన స్వస్థలం ఊనగట్లకు, మాతామహులస్థానం భీమడోలుకు, చదువుకొనసాగించే రాజమండ్రికి మధ్య తరుచు తిరగవలసి రావడంతో కేసరీ సమాజంతోపాటు తన గ్రామంలోను, భీమడోలులోను కూడా ఔత్సాహిక నాటక సమాజాలను స్థాపించి నాటకాలు ప్రదర్శించి ఆ వచ్చిన ధనాన్ని పాఠశాలలకు, పుస్తకాలయాలకు విరాళంగా యిచ్చేవారు. ఈ ప్రస్థానంలో 'చింతామణి', 'ప్రతాపరుద్రీయం' వంటి నాటకాలను ప్రదర్శించే అవకాశం కలిగింది. కలిగిన

కుటుంబం కావడంతో ధనార్జన కోసం కాక కళాపేక్షతోనే నాటకాలు ప్రదర్శించేవాడు.

కొచ్చెర్లకోట తొలి సినిమా ప్రవేశం సరస్వతీ టాకీస్‌వారి 'ద్రౌపదీ వస్త్రాపహరణం'లో సహదేవుని పాత్ర ద్వారా. ఆ తరువాత 'కృష్ణ జరాసంధ'లో కృష్ణుడుగా, 'వరవిక్రయం'లో బసవరాజుగా, వై.వి.రావుగారు నిర్మించిన 'మళ్లీ పెళ్లి'లో రెండో నాయకపాత్రలోను, 'పాదుకాపట్టాభిషేకం'లో లక్ష్మణుడుగాను నటించారు. తిరిగి నాటకరంగానికి వచ్చి 'జరాసంధ'లో వేమూరి గగ్గయ్యగారితోను, స్థానం నరసింహారావుగారితో 'సారంగధర'లో సారంగధరుడుగాను, 'తులాభారం'లో వారి సత్యభామకు తాను కృష్ణుడుగాను నటించి గొప్ప నటుల చేత శెహబాస్ అనిపించుకున్నారు.

ఆ తరువాత బందా కనకలింగేశ్వరరావుగారి ప్రభాత్ థియేటర్స్‌లో చేరి బందావారు కృష్ణుడి పాత్ర ధరిస్తే కొచ్చెర్లకోట అర్జునుడుగా నటించి పాండవ నాటకాల ద్వారా ఎనలేని కీర్తిని సంపాదించారు. దీనితో పాటు 'బొబ్బిలియుద్ధం'లో వెంగళరావు, 'సతీ సావిత్రి'లో సత్యవంతుడు, 'చింతామణి'లో భవానీశంకరుడు, 'కాళిదాసు'లో కాళిదాసు పాత్రలను చేపట్టి మన్ననలందుకున్నారు.

కొన్నాళ్లు తెనాలిలో బేతా వెంకటరావుగారితో 'రామాంజనేయ యుద్ధం'లో రామునిగా నటించారు. అది ప్రేక్షకులను ఆసాంతమూ అలరించిన పాత్ర. తన ఆకర్షణీయమైన ముఖకవళికల ద్వారాను, హావభావాల ద్వారాను, సన్నివేశాలకు అనువైన భావోద్వేగాలను ప్రస్ఫుటంగా వెల్లడించగల సాత్త్వికాభినయం ద్వారాను, శ్రావ్యమైన ఆలాపనలతో సాగే పద్యాల, పాటల ద్వారాను కొచ్చెర్లకోట రాముడు, కృష్ణుడు పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకొని అలరించారు.

ఆయన 1969 డిసెంబరు 20న ఏలూరులో స్వర్గస్థులైనారు. ◆

'గాన గంధర్వ'

# పి.సూరిబాబు



సూరిబాబుగారనగానే అనితర సాధ్యమైన ఆయన కంచు కంఠం, ఎంతసేపైనా రాగం పూరించగల ఆయన గాత్రధర్మం జ్ఞాపకం వస్తాయి. అయిదు దశాబ్దాల పాటు తన గానంతో, తన సమాజ నిర్వహణా నేతృత్వంతో, నాటక ప్రయోగ వైశిష్ట్యంతో తెలుగు ప్రేక్షకులను అలరించిన వ్యక్తి సూరిబాబు.

ఇంటి పేరు పువ్వుల. 1915 ఫిబ్రవరి 22వ తేదీన గుడివాడ తాలూకా బొమ్ములూరులో జన్మించాడు. చిన్నతనం నుంచే నాటకాల మీది ఆసక్తితో మూడవ క్లాసుతో చదువుకు వీడ్కోలు పలికాడు. అప్పటికే ఊరిలో నెలకొని వున్న సీతారామాంజనేయ నాటక సమాజం (దాని అధినేత-ఊరిపెద్ద-లింగం అంజయ్యగారు)లో బాల నటుడుగా స్థానం సంపాదించి, తొలిసారిగా 'బొబ్బిలి యుద్ధం' నాటకంలో చినరంగారాయుడి పాత్ర ధరించాడు. చిన్నతనం నుంచే మేనమామ హనుమాన్లు దగ్గర సంగీత నేర్చుకోవడం ప్రారంభించడంతో నాటక పాత్రను అవలీలగా నటించి పెద్దల మన్ననలు పొందాడు. కాని ఇంట్లో వారికి యిష్టం లేకపోయింది. వారి కట్టడి నుంచి తప్పించుకొని నాటకాలు వేయాలన్న పట్టుదలతో గుడివాడకు చెందిన డి.వి.యల్.నరసింహారావు, పి.చంద్రమౌళి, కవుతరం గ్రామానికి చెందిన హేమాంబర దాసుగార్లతో కలిసి గద్వాలకు పారిపోయి, అక్కడ రాజావారి



'శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం' (1960)లో

ఆస్థాన నాటక సమాజం ప్రదర్శించే 'రామదాసు' నాటకంలో రఘురాముడి పాత్ర, 'శ్రీకృష్ణలీలలు' నాటకంలో బాలకృష్ణుని పాత్ర ధరించాడు.

గద్వాల నుంచి తిరిగి రాగానే గుంటూరుకు చెందిన దంటు వెంకట కృష్ణయ్యగారు 'బాలమిత్ర సభ' అనే పేరుతో కేవలం చిన్నపిల్లలతోనే ఒక నాటక సభను ప్రారంభించి ఆ సభలోనికి సూరిబాబును కూడా ఆహ్వానించారు. ఆ సభలో నాటకాలకు దర్శకుడు, సంగీత దర్శకుడు, ప్రఖ్యాత ప్రయోక్త కొప్పరపు సుబ్బారావుగారు. వారి నేతృత్వంలో సూరిబాబు సంగీతంలోని మెలకువలను నేర్చుకున్నాడు. ఆ సభలో ఆయన కంసుడు, వసుదేవుడు, రాంసింగ్, నారదుడు మొదలైన పాత్రలు ధరించి నాటక నిర్వహణంలోను, దర్శకత్వంలోను, నటనలోను ఎన్నో లోతుపాతులను గ్రహించాడు. బాలమిత్ర సభ ఖ్యాతి, దానితో సూరిబాబు నటనా విధానం ఆంధ్రదేశమంతా తెలియడంతో ఆయన కొన్నాళ్లు కురుకూరి సుబ్బారావుగారి నాటక సమాజంలో చేరి నాటకాలు ప్రదర్శించాడు.

1931లో ఇంట్లో వున్న నగలనన్నింటిని అమ్మి గుడివాడలో 'బాలకృష్ణ సమాజం' అనే పేరుతో నాటక సమాజాన్ని స్థాపించాడు. కాని ఆ సమాజం ఆర్థికంగా నష్టపోయింది. 1936లో తెనాలిలో స్థిరనివాసం ఏర్పరచుకొని 'సత్యనారాయణ నాట్యమండలి' పేరుతో నాటకాలు ప్రదర్శించడం ప్రారంభించాడు.

1944లో నటి రాజేశ్వరిని వివాహం చేసుకొని విజయవాడలో స్థిరపడి 'రాజరాజేశ్వరీ నాట్యమండలి'ని స్థాపించాడు. కొప్పరపు సుబ్బారావుగారి చేత 'తారాశశాంకం' నాటకం రాయించి ఆయనకే దర్శకత్వ బాధ్యతలు అప్పగించి దానిని దిగ్విజయంగా ప్రదర్శించే ఏర్పాట్లు చేశాడు. ఆ నాటకంలో సూరిబాబు, రాజేశ్వరి ప్రధాన భూమికలు ధరించేవారు. ఆ నాటకంతో ఆంధ్రదేశం నలుమూలలా వారి పేరు ప్రచారంలోకి వచ్చింది. ఆ నాటక విజయంతో ఆ మండలి 'భూకైలాస్, కురుక్షేత్రం, తులాభారం, విప్రనారాయణ' వంటి 20 నాటకాలను చేపట్టి ఆంధ్రదేశంలోనే కాక బెంగుళూరు, మైసూరు, బొంబాయి, కలకత్తా, మదరాసు వంటి పట్టణాలలో ప్రదర్శించి ఎనలేని కీర్తిని ఆర్జించింది. 1946లో మైసూరు మహారాజావారు తమ దర్బారులో సూరిబాబును ఘనంగా సన్మానించారు. 1957లో తెనాలిలో పట్టణ ప్రజలు గజారోహణం, కనకాభిషేకం చేసి 'గానగంధర్వ' బిరుదునిచ్చారు. డా॥ రాధాకృష్ణన్ సమక్షంలో 'విప్రనారాయణ' నాటకాన్ని ప్రదర్శించి వారి సత్కారాన్ని అందుకున్నారు.

సూరిబాబు ఒక పద్ధతి పాత్రలకు, ఒక శైలిలో గానానికి అలవాటుపడ్డ నటుడు కాడు. అనేక రకాలైన పాత్రలు, ఏ పాత్రకు తగినట్లు ఆ పాత్రకు పాట. ఇదీ ఆయన నాటక సూత్రం. ఒక్క 'కురుక్షేత్రం' నాటకంలోనే ఆయన ధర్మరాజు, భీముడు, అర్జునుడు, భీష్ముడు, అశ్వత్థామ, ధృతరాష్ట్రుడు వంటి భిన్నపాత్రలను ధరించి తాను చేపట్టిన ప్రతిపాత్రకు న్యాయం చేశాడు. 24 సంవత్సరాలు రాజరాజేశ్వరీ నాట్యమండలిని నిరాఘాటంగా నడిపి సమకాలీన కాంట్రాక్టు నాటక పద్ధతులకు భిన్నంగా తమ వృత్తి నాటక మార్గాన్ని ఎన్నుకొన్న నలుగురైదుగురు నటులలో ఒకడై నిలిచాడు.

1935లో 'సీతాకల్యాణం' సినిమాతో తన సినీ జీవితాన్ని ప్రారంభించి దాదాపు యాభై సినిమాలలో తన నటనా పాటవాన్ని చాటాడు. 'ద్రౌపదీ వస్త్రాపహరణం'లో నారదుడు, 'కనకతార'లో యోగి, 'మాలపిల్ల'లో చౌదరి, 'తారాశశాంకం'లో బృహస్పతి, 'శ్రీ కృష్ణతులాభారం', 'సావిత్రి', 'నారదనారది' సినిమాలలో నారదుడు యిలా ఎన్నో సినిమాలలో పాత్రలు ధరించి అటు నాటకరంగం మీద, యిటు సినిమారంగంలోను తనదైన ఒక శైలితో, గుర్తింపును పొందిన నటుడు సూరిబాబు.

రాజరాజేశ్వరీ నాట్యమండలి రజతోత్సవాలు ఘనంగా చేయాలన్న ప్రయత్నంలో ఉండగానే 1968 ఫిబ్రవరి 12న కన్నుమూశారు. ఆయన కంచు కంఠమూ, గుక్క తిప్పుకోకుండా కొనసాగించగల రాగ విజ్ఞానం మనకు వదలివెళ్లాడు. ◆

'గాన గంధర్వ', 'అభినవ కృష్ణ'

# కల్యాణం రఘురామయ్య



నిండైన శరీరసౌష్టవంతో, నగుమోముతో, ఆహార్య ఔచిత్యంతో, కర్ణాటక హిందుస్తాన్ రాగఫణితుల మేళవింపుతో చూపరులకు నయనానందాన్ని, శ్రోతలకు వీనులవిందును చేస్తూ ఆరుదశాబ్దాల కాలం తెలుగు నాటక, సినిమారంగాలలో ప్రశస్తి పొందిన "ఈలపాట" రఘురామయ్యకు తల్లితండ్రులు పెట్టిన పేరు వెంకట సుబ్బయ్య. సామాన్య కుటుంబంలో పుట్టి, పెద్దగా చదువు సంధ్యలు అబ్బకపోయినా, దైవదత్తమయిన గాత్ర ధర్మంతో, సాధనతో తనకంటూ ఒక సుస్థిరమైన స్థానాన్ని నిర్మించుకున్న నటుడు రఘురామయ్య.

ఎనిమిదేళ్ళ ఉండగా పొలాల మీద గొడ్లను మేపుకుంటూ వచ్చీరాని పద్ధతిలో పాటలు పాడుకొంటున్న వెంకట సుబ్బయ్య పాటను అప్పటికే లబ్ధ ప్రతిష్ఠుడైన నాయకునిగా పేరు ప్రఖ్యాతులు పొందిన యడవల్లి సూర్యనారాయణగారు, గుంటూరు 'బాలమిత్ర సభ' స్థాపకులు దంటు వెంకట కృష్ణయ్యగారు వినడం తటస్థించింది. ఈ పసివాడి అమృతగాన వాహినికి అబ్బురపడిన వారిద్దరూ ఆయన తండ్రిగారి అనుమతితో వెంకట సుబ్బయ్యను తమతో తీసుకొని పోయి, సంగీతం నేర్పించి తమ నాటకాలలో బాలపాత్రలను యిచ్చారు. యడవల్లి ప్రక్కన రామదాసు నాటకంలో రామదాసు కుమారుడు రఘురాముని పాత్రను అత్యద్భుతంగా ప్రదర్శించడంతో ఆనాటి నుంచి వెంకటసుబ్బయ్య రఘురామయ్యగా మార్పు చెందాడు.

బాలపాత్రల తరువాత రఘురామయ్య స్త్రీ పాత్రలు ధరించేవాడు. ఆంధ్రదేశంలో ప్రసిద్ధ నటులందరి ప్రక్కన స్త్రీ పాత్రలు ధరించాడు. చింతామణి, రుక్మిణి, శకుంతల పాత్రలలో రాణించాడు. యడవల్లి సూర్యనారాయణగారి ప్రక్కన అశేషమైన నాటకాలలో నాయిక వేషాలు ధరించి గణుతికెక్కాడు.



రఘురామయ్య రెండుతరాల నాటక ప్రేక్షకుల్ని అలరించిన ఏకైక నటుడు. అలానే రెండు తరాల సినిమా ప్రేక్షకులను అలరించిన నటుడు కూడా రఘురామయ్యే! శ్రీ కృష్ణతులాభారం, సక్కుబాయి, చింతామణి, కురుక్షేత్రం, పాదుకా పట్టాభిషేకం, శకుంతల వంటి పలు నాటకాలలో ప్రధాన పాత్రలు ధరించాడు. ఏ పాత్ర ధరించినా, ప్రేక్షకుల కోరిక మేరకు తన ఈలపాటను వినిపించక తప్పేదికాదు. పండిత నెహ్రూ, ఇందిరాగాంధి, రాజేంద్రప్రసాద్, రాధాకృష్ణన్ వంటి రాజకీయ నాయకులు కూడా ఆయన ఈలపాటను విని ముగ్ధులైనారు.

1935లో సినిమా రంగప్రవేశం చేసిన రఘురామయ్య 'పృథ్వీపుత్ర', 'కుచేల', 'రుక్మిణీ కల్యాణం', 'గొల్లభామ', 'అపవాదు', 'మాయారంభ', 'అగ్నిపరీక్ష', 'చంద్రవంక', 'శ్రీకృష్ణతులాభారం' వంటి సినిమాలలో నటించాడు. 1935లో వచ్చిన 'కుచేల'లోను 1961లో వచ్చిన 'కుచేల' సినిమాలోనూ ఆయనే కృష్ణ పాత్ర ధరించడం ఒక విశేషం.

స్త్రీ పాత్రలకు ప్రఖ్యాతి పొందిన మరాఠీ నటుడు బాలగంధర్వకు ఏకలవ్య శిష్యుడుగా, ఆయన పాడిన హిందూస్థానీ సంగీత బాణీలను అనుకరిస్తూ, ఆ పద్ధతిని తెలుగులో విజయవంతంగా ప్రవేశపెట్టిన ఘనత రఘురామయ్యది. అలుపు సొలుపు ఎరుగక ఏకబిగిన రెండు వందల పద్యాలు పాడగలిగిన శరీరం, శారీరం ఆయనవి. తన గానంతో ప్రేక్షకులను ఎలా తన్మయులను చేశాడో, తన ఈలపాటతో కూడా అలాగే సమ్మోహితులను చేసే కల్యాణం రఘురామయ్య ప్రతిభకు గుర్తింపుగా 1975లో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం, 1975లోనే పద్మశ్రీ పురస్కారం లభించాయి.

దృఢకాయుడు, నిరంతరం శరీర వ్యాయామం చేసే రఘురామయ్య 1975 ఫిబ్రవరి 24న గుండెపోటుతో మరణించారు. ఆయన మృదు మందహాసం, నిండైన ముఖవర్చస్సు, ఆయన పాట, ఈలపాట - ఇవి అన్నీ ఎరిగిన ఆనాటి ప్రేక్షకులకు రఘురామయ్య ఎప్పటికీ కృష్ణుడే! ◆

'నటశేఖర'

# బందా కనకలింగేశ్వరరావు



తెలుగు నాటక, సినీరంగాలలో తాను ఏ పాత్ర ధరించినా దానిని గురించిన విశ్లేషణాత్మకమైన అవగాహన గల నటులలో బందా కనకలింగేశ్వరరావుగారు ఒకరు. నటుడుగా ఉన్నతిని సాధిస్తూనే న్యాయవాది అయినాడు. న్యాయవాద వృత్తి వదిలి స్వయంగా 'ప్రభాత్ థియేటర్స్' అనే నాటక సంస్థను స్థాపించి, తన కోసం ప్రత్యేకంగా నాటకాలు వ్రాయించుకొని ఆదర్శప్రాయంగా నటించి, దర్శకత్వం వహించి పండిత పామర ప్రశంసలు పొందాడు. ఆయన బాహుక వేషం చూసిన బళ్లారి రాఘవ - బందాను తన నటవారసునిగా పేర్కొన్నాడు.

బందావారు 1907 జనవరిలో కృష్ణాజిల్లా కైకలూరు తాలూకా ఆటపాక గ్రామంలో జన్మించారు. తండ్రి శ్రీశైలంగారు కొల్లేటి లంకలకు కరణం. బందావారి విద్యాభ్యాసం ఆటపాకలోను, ఏలూరులోను, బందరులోను కొనసాగింది. మద్రాసు న్యాయ కళాశాల నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పుచ్చుకున్నారు. కాలేజీలో చదువుతూ ఉండగానే 'పాండవోద్యోగం' నాటకంలో కృష్ణ వేషంతో మొదటి సారి రంగస్థలం ఎక్కారు. ఆ నాటకంలో దుర్యోధనుడు వేషం వేసిన తన బావమరిది కొడాలి సుబ్బారావుతో కలిసి నాటకాలాడుతూ వచ్చారు. మదరాసులో 'లా' చదువుతూ చెన్నపురి ఆంధ్ర సభలో సభ్యుడిగా చేరి ఆ సభ ప్రదర్శించే నాటకాలలో పాల్గొన్నారు. అప్పుడే 'సారంగధర' నాటకంలో బళ్లారి రాఘవ రాజరాజనరేంద్రుడి వేషం వేస్తే, బందా సారంగధరుడుగా నటించారు. 1934లో ఏలూరులో న్యాయవాద వృత్తి ప్రారంభించారు. ప్రభాత్ థియేటర్స్ కోసం ఊటుకూరు సత్యనారాయణరావు, జంపన చంద్రశేఖరరావు వంటి రచయితల చేత నాటకాలు వ్రాయించుకొని నాటకాలను పరిపుష్టంగా ప్రదర్శించారు.

బందావారు కృష్ణుని పాత్రకు ప్రసిద్ధి. అయినా బాహుకుడు, కాళిదాసు, బిల్వమంగళుడు, ప్రతాపరుద్రుడు, శ్రీనివాసుడు, కర్ణుడు, కణ్వుడు, రాముడు, అభిమన్యుడు, సారంగధరుడు, గిరీశం, సలీం, రఘునాథ్, శివాజీ, అల్లూరి సీతారామరాజు, పిచ్చి రామశాస్త్రి వంటి ఎన్నో పాత్రలను సమర్థవంతంగా

నిర్వహించారు. అభినవ కృష్ణ, నటశేఖర బిరుదాంకితులు.

1935లో బొంబాయిలో నిర్మించిన 'ద్రౌపదీ మాన సంరక్షణ'లో కృష్ణుడుగా సినిమా జీవితం ప్రారంభించారు. ఆనాటి నుంచి పదేళ్ల పాటు 'సారంగధర', 'కాలచక్రం', జెమినీ వారి 'బాలనాగమ్మ' చిత్రాలలో నాయక పాత్ర, 'పాదుక'లో భరతుని పాత్ర నిర్వహించారు. 1941లో భార్యావియోగంతో చిత్ర పరిశ్రమ నుంచి వైదొలగి తిరిగి ఏలూరు చేరుకున్నారు. నాటక కార్యక్రమాలు ఉధృతం చేశారు. యుద్ధకాలంలో నాటకాల ద్వారా లక్షలు సంపాదించారు. ఇరవై ఐదేళ్లు తమ నాటక సమాజాన్ని ఆదర్శవంతంగా నిర్వహించారు.

1955లో రష్యా, ఫిన్‌లెండ్, చెకొస్లొవేకియా దేశాలు పర్యటించి అక్కడి నాటకకళ స్థితిగతులను అవగాహన చేసుకొన్నారు. తిరిగి రాగానే కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యత్వం లభించింది. ఆ సంస్థ పక్షాన కూచిపూడి యక్షగానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కూచిపూడిలో కళాక్షేత్రం ప్రారంభించారు. ఏలూరులో నాటక శిక్షణ కళాశాలతో పాటు నృత్యకళాక్షేత్రం ప్రారంభించారు - కూచిపూడి నాట్య కళాప్రచారానికి అవిశ్రాంతం శ్రమించారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు.

చివరి పది సంవత్సరాలు ఆలిండియా రేడియో, విజయవాడలో నాటక ప్రయోక్తగా ఉద్యోగం చేసి ఎన్నో ప్రేక్షకామోదం పొందిన నాటకాలను ఆకాశవాణి ద్వారా వినిపించారు. కూచిపూడి యక్షగానాలను రికార్డు చేసి వాటి సాంప్రదాయక విధానాలను తరువాతి తరాల కోసం భద్రపరిచే కృషి చేశారు.

బందా ఏ వేషం వేసి ఎంత బాగా నటించినా, ప్రేక్షకులు మాత్రం ఆయన పాడిన "గుత్తివంకాయ కూరోయ్ బావా" పాడకుండా విడిచిపెట్టేవారు కాదు. బందా ఎంత ప్రతిఘటించినా తెలుగు ప్రేక్షకుల ధిక్కారానికి ఆయన తల ఒగ్గక తప్పేది కాదు. ఆయన ఎన్ని రికార్డులు యిచ్చినా ఆ పాటకున్నంత ప్రఖ్యాతి మరియే పాటకు పద్యానికి రాలేదు.

నటుడుగా సంస్కారవంతమైన పాత్ర చిత్రణం చూపారు. నాటక సంస్థ నిర్వాహకుడుగా క్రమశిక్షణతో కూడిన, ఉన్నత ప్రమాణాలు గల నాటకాలను తమకోసమే వ్రాయించుకొని ప్రదర్శించారు. కూచిపూడి నాట్య పురోగతికి అహరహం శ్రమించారు. ఉత్తమ నాటకాల ప్రయోక్తగా శ్రోతల కృతజ్ఞతకు పాత్రులయ్యారు. నిగర్వి, నిత్య సంతోషి అయిన బందా నియమనిష్ఠలతో జీవితం సాగించి 1968 డిసెంబరు 3వ తేదీన నిర్యాణం చెందారు. ◆

# యస్.రాజేశ్వరరావు



మధుర సంగీత సమ్రాట్టు రాజేశ్వరరావు. తన గళాన్ని వేణువుగా చేసి తెలుగు గుండెల మీద నర్తించిన సమ్మోహన మూర్తి రాజేశ్వరరావు. తెలుగు గాన ఆరామానికి చలువ పందిళ్లు వేసింది ఆయన భావుకత. తెలుగు లలిత సంగీతానికి శాస్త్రీయ సంగీతం సరసన సమున్నతస్థానాన్ని సంపాదించి పెట్టింది ఆయన వాల్లభ్యం. సినిమా పాటకి సాంస్కృతిక గౌరవాన్ని సాధించింది ఆయన సంగీత దార్శనికత. రాజేశ్వరరావు పాట యమునాతటిపై వీచే చల్లగాలి. ఆయన గాత్రం శ్యామసుందరుని మురళీనాదం. తెలుగువారి లాలిత్యాన్నంతా కలబోసి ఆరబోసిన పండువెన్నెల రాజేశ్వరరావు పాట.

రాజేశ్వరరావు 1922వ సంవత్సరం విజయనగరం జిల్లా సాలూరు దగ్గరగా వున్న శివరామపురంలో జన్మించారు. తండ్రి సాలూరు సన్యాసిరాజు. ద్వారం వెంకటస్వామి నాయుడుగారి వాయులీనానికి మృదంగ సహకారం అందించే వారు. తండ్రిగారి దగ్గరే సంగీతంతో పాటు తబల, హార్మోనియం కూడా నేర్చుకున్నారు రాజేశ్వరరావు. 1935లో వేల్ పిక్చర్స్ వారు తీసిన 'శ్రీకృష్ణలీలలు' సినిమాలో కృష్ణుడు వేషం వేశారు. ఆ సినిమా చిత్రీకరణంతా కలకత్తాలో జరిగింది. ప్రఖ్యాత హిందూస్థానీ గాయకుడు, నటుడు కె.ఎల్.సైగల్ గారి దగ్గర గజల్స్ నేర్చుకున్నారు. అలాగే పంకజ్ మల్లిక్ గారి దగ్గర ఆర్కెస్ట్రేషన్ విధానం నేర్చుకున్నారు. సంగీత వాద్యనిర్వహణానికి అవసరమైన అన్ని సాంకేతిక విధానాలను నేర్చుకొని మద్రాసు తిరిగివచ్చి స్వయంగా ఆర్కెస్ట్రాను నిర్వహించడం ప్రారంభించారు.

రాజేశ్వరరావు తొలిసారిగా తన పదిహేడవ యేట 'జయప్రద' సినిమా (1939)కి సంగీత దర్శకత్వం వహించారు. ఆ తరువాత ఆయనకు బాగా పేరు తెచ్చిన చిత్రం 'ఇల్లాలు'. 1941లో ఆయన యస్.యస్.వాసన్‌గారి జెమినీ సంస్థలో శాశ్వత సంగీత దర్శకుడుగా నెల జీతంమీద చేరాడు. ఆ సంస్థ నిర్మించిన 'బాల నాగమ్మ', 'చంద్రలేఖ' సినిమాలకు రాజేశ్వరరావు యిచ్చిన సంగీతం సంగీతజ్ఞులను చకితుల్ని చేసింది.


జెమినీ సంస్థ నుంచి బయటకు రాగానే రాజేశ్వరరావు సంగీత దర్శకత్వం వహించిన చిత్రం 'మల్లీశ్వరి' (1951). 1954లో వచ్చిన చిత్రం "విప్రనారాయణ". ఈ రెండు చిత్రాలకు రాజేశ్వరరావు యిచ్చిన సంగీతం కవికలం నుంచి వెలువడే భావుకతకు, నటుడు వెలువరించే ఉద్వేగాలకు భావాత్మకమైన వారధిని నిర్మించి సినిమాలలో సంగీత పరమావధి ఏమిటో నిర్వచించింది. అదీ ఆయనలోని సృజనాత్మక సౌజన్యమూర్తి. ఆ తరువాత ఆయన అనేక సినిమాలకు సంగీతం సమకూర్చి తాను కూర్చిన బాణీలు నిత్యనూతనంగా, శ్రోతృపక్వంగా రూపుదిద్దారు. 'మిస్సమ్మ', 'అప్పుచేసి పప్పుకూడు', 'భలే రాముడు', 'భక్త జయదేవ', 'ఆరాధన', 'చెంచులక్ష్మి', 'కులగోత్రాలు', 'భార్యాభర్తలు', 'ఇద్దరు మిత్రులు', 'అమరశిల్పి జక్కన', 'రంగులరాట్నం', 'పూజాఫలము', 'చదువుకున్న అమ్మాయిలు', 'పూలరంగడు', 'వసంతసేన', 'ఆత్మీయులు', 'కురుక్షేత్రం' వగైరాలలో సంగీతం ఆబాలగోపాలాన్ని అలరించింది.

తెలుగు సినిమా పాటకు లాలిత్యాన్ని నేర్పింది కృష్ణశాస్త్రి అయితే, దానికి మాధుర్యాన్ని తెచ్చింది రాజేశ్వరరావు. కృష్ణశాస్త్రి మాటలతోనే దృశ్యాలను మన కళ్ల ముందుకు తెప్పిస్తే, రాజేశ్వరరావు ఆ మాటలకు ముందుయిచ్చే నేపథ్య సంగీత సూచనతోనే రాబోతున్న చిత్రాన్ని మనముందు దృశ్యమానం చేస్తాడు.

రాజేశ్వరరావు స్వంతంగానూ, రావు బాలసరస్వతీ దేవితో కలిసి పాడిన గీతాలు ఎన్నితరాలు దాటినా అమృతపు గుళికలే! సామాన్యులకు కూడా దప్పిక తీర్చే ఒయాసిస్‌లే!

ఇక రాజేశ్వరరావు వాడిన రాగాలు, కలబోసిన మిశ్రమాలు, గుదికూర్చిన రాగమాలికలు, జతచేసిన విభిన్న శైలీ విధానాలు - తలుచుకున్న కొద్దీ గుండె ఉప్పొంగుతుంది. తెలుగు సినిమా పాటకు నవవధూ సోయగాలు కూర్చిన రాజేశ్వరరావు గొంతు 26.10.1999 తేదీన శాశ్వతంగా మూగబోయింది. అయితే రాజేశ్వరరావు వదిలి వెళ్లిన అనంతమైన పెన్నిధిని - ఆయన పాటల ఆరామాలు, ఆయన నిర్మించిన సంగీత సౌధాలు - భావితరాల సంగీత ప్రియులకోసం భద్రంగా దాచి పెట్టే వుంచుతాయి. ◆

# టంగుటూరి సూర్యకుమారి



గాయని, నృత్యకళాకారిణి, రంగస్థల చలనచిత్ర నటి, యోగా అధ్యాపకురాలు, లండన్‌లోని 'ఇండియా పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ సొసైటి' వ్యవస్థాపకురాలు అయిన సూర్యకుమారి 1926వ సంవత్సరం నవంబరు 13వ తేదీన రాజమండ్రిలో జన్మించింది. తండ్రి టంగుటూరి శ్రీరాములు. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారి తమ్ముడు, వృత్తిరీత్యా న్యాయవాది. తల్లి రాజేశ్వరి. సూర్యకుమారికి సంగీతం పుట్టుకతో వచ్చిన విద్య. చాలా చిన్నతనంలోనే ఆమె కపిలవాయి రామనాథశాస్త్రి, స్థానం నరసింహారావుల గ్రామఫోను రికార్డు పాటలను విని, అలానే సాధన చేసి తిరిగి అదే విధంగా పాడుతూవుండేది. సూర్యకుమారి కుటుంబ సభ్యులందరూ పాడగలిగిన వారే! ఏ బడికీ వెళ్ళి ఏ పాఠాలు నేర్చుకోలేదు ఆమె. తండ్రి చెప్పే ఇంగ్లీషు పాఠాలు వినేది. ఇంగ్లీష్ నవలలు చదివేది. అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడేది. చిన్నతనంలోనే ఆమె ప్రసిద్ధికి రావడంతో స్కూలుకు పంపడం కుదరలేదు.

అయితే సూర్యకుమారి చిన్ననాటి నుంచే పెదనాన్న గారితో జాతీయోద్యమ సభలకు వెళ్లడం, అక్కడ దేశభక్తి గీతాలు పాడడం మొదలు పెట్టింది. స్కూలుకు పంపడం కుదరనందున ఇంటి నుంచే కేంబ్రిడ్జి సీనియర్‌కు తయారైంది. అలాగే

కర్ణాటక సంగీతం అరియక్కుడి రామానుజయ్యంగారు, పరూర్ సుందరంగార్ల దగ్గర గురు-శిష్య పద్ధతిలో నేర్చుకున్నది. కూచిపూడి నాట్యాన్ని వేదాంతం జగన్నాథశర్మగారి దగ్గర, భరతనాట్యం పండిట్ జోషీగారి దగ్గర నేర్చుకున్నది. రామకృష్ణమిషన్‌కు చెందిన స్వామి పవిత్రానంద నుంచి యోగాలో శిక్షణ పొందింది.

సూర్యకుమారి పెద్ద అక్క సావిత్రి. ఆమె వివాహానంతరం మద్రాసులో స్థిరపడ్డది. ఒకసారి సూర్యకుమారి మద్రాసు వెళ్లినప్పుడు తన బావగారి (ఆయన పేరు సూర్యప్రకాశరావు, లాయరు) దగ్గరకు వచ్చిన ఒక వ్యక్తి ఆమె పాట వినడం తటస్థించింది. ఆయనకు మద్రాసు సినిమా వాళ్లతో పరిచయం ఉంది. "సూర్యకుమారి అంత బాగా పాడతున్నది. ఆమెకు సినిమాలలో ప్రవేశం వచ్చే విధంగా చూస్తాను" అన్నాడు. సూర్యకుమారికి సినిమా ప్రవేశం వచ్చింది గాని అది తెలుగు సినిమాలో కాదు. 'విప్రనారాయణ' అన్న తమిళ సినిమాలో, 1937లో ఆమె 11వ ఏట!

ఆ సినిమా చూసినవారు సూర్యకుమారి నటించింది అనడంతో ఆమెకు సినిమా ఛాన్సులు రావడం మొదలుపెట్టాయి. దీనితో తల్లిదండ్రులు రాజమండ్రి వదిలి మద్రాసులో స్థిరపడవలసి వచ్చింది. సూర్యకుమారి తరువాతి సినిమా "అంబికాపతి" (1938) కూడా తమిళ సినిమానే! ఆ సినిమాతో ఆమె ఒక నటిగా గుర్తింపు పొందింది. ఆమె తెలుగులో నటించిన తొలిచిత్రం "రైతుబిడ్డ" (1939). అది సారథీ ఫిలిమ్స్‌వారి చిత్రం. దర్శకుడు గూడవల్లి రామబ్రహ్మం. బళ్లారి రాఘవ, కొమ్మూరి పద్మావతి, గిడుగు సీతాపతి, పి.సూరిబాబు యీ సినిమాలో నటులు. ఈ చిత్రంలో ఆమె పాడిన "రాబోకు రాబోకు చందురూడా" అనే పాట ఆ రోజులలో ప్రతివారి నోటి వెంట వినవచ్చేది. ఆ తరువాత ఆమె 'దీనబంధు' (1942), 'కృష్ణ ప్రేమ' (1943) అన్న రెండు తెలుగు సినిమాలలో నటించింది. ఈ రెండు చిత్రాలలోని పాటలు ఎంతో ప్రాచుర్యాన్ని పొంది సూర్యకుమారిని నటలోకంను, గాయకలోకంలో కూడా ప్రఖ్యాతురాలిని చేశాయి. 1947 నుంచి 1951 వరకు ఆమె తమిళ సినిమాలలో నటించింది. 1952లో తిరిగి 'మరదలు పెళ్లి' సినిమాలో నటించడమే కాక, సంగీత సారథ్యం కూడా వహించింది. అందులో శ్రీశ్రీ రాసిన పాట "జాబిలీ, ఓ జాబిలీ" పాట రికార్డు వేల సంఖ్యలో అమ్ముడుపోయింది.

1944 నుంచే సూర్యకుమారి సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేది. కచేరీలు చేసి వచ్చిన డబ్బును క్రాంతిపురం క్షయ వైద్యశాలకు, అనంతపురం, రాజమండ్రి, ఆదోనిలలోని అనాథాశ్రమాలకు, సిలోన్‌లోని బాదుల్లా అనాథాశ్రమానికి, గుంటూరు, హైదరాబాదు, గూడూరు, కలకత్తా, కొచ్చిన్‌లలోని సేవాశ్రమాలకు యిచ్చి

సహాయం చేసింది. 1952లో ఆమె "మిస్ మద్రాసు"గా ఎన్నుకోబడ్డది. భారత ప్రభుత్వం అమెరికాకు పంపిన సాంస్కృతిక బృందంలో రాజ్‌కపూర్, నర్గీస్, ప్రేమనాథ్, డేవిడ్, బీనారాయ్ వంటి వారితో పాటు దక్షిణ దేశం నుంచి ఆమె కూడా ఒక సభ్యురాలుగా ఉంది. ఆమె తెలుగు పాటలతో అమెరికన్ శ్రోతలను అలరించింది.

ఈ అమెరికా పర్యటన తరువాత సూర్యకుమారికి హిందీ సినిమాలలో నటించవలసిందిగా ఆహ్వానాలు రాసాగాయి. 'వతన్', 'ఉరన్ ఖటోలా'లలో నటించింది. ఆమె నటించిన చివరి తెలుగు సినిమా 'రామదాసు'. ఇందులో ఆమె తానీషా భార్య సితార బేగంగా నటించింది. శాంతారాం హిందీలో తీసిన 'అప్నాదేశ్' అనే తెలుగు అనువాద సినిమాలో ఆమె ఆరు పాటలు పాడింది.

సూర్యకుమారిని ఈ నాటికీ ఆంధ్రదేశం జ్ఞాపకం చేసుకొనేవి ఆమె పాడిన దేశభక్తి గీతాలు, లలిత గీతాలు. అవి ఆమె గాన ప్రతిభకు గీటురాళ్ళు. "మా తెలుగు తల్లికి" ఒక్కటి చాలు ఆమెను అజరామరం చేయడానికి. బాలాంత్రపు రజనీకాంతరావు వ్రాసిన ఎన్నో అద్భుతమైన లలిత గీతాలకు సూర్యకుమారి తన మధుర మంజుల గానంతో శాశ్వతత్వం కల్పించింది. "శతపత్రసుందరి", "ఎవరు విన్నా రెవరుకన్నారు", "ఉదయమ్మాయెను స్వేచ్ఛా భారత", "మ్రోయింపు జయభేరి ", "మాదీ స్వతంత్రదేశం" మొదలైనవన్నీ రజనీకాంతరావు సంగీతం సమకూర్చగా సూర్యకుమారి పాడినవి. అలాగే బసవరాజు అప్పారావు, అడవి బాపిరాజు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీలు వ్రాసిన లలిత గీతాలను పాడిందామె.

సూర్యకుమారి లండన్‌లో స్థిర నివాసం ఏర్పరుచుకొని అక్కడి నాటకాలలోను, టెలివిజన్ సీరియల్స్‌లోను, సినిమాలలోను నటించింది. ముఖ్యంగా ఠాగూరు రచించిన "చిత్రా", "ది కింగ్ ఆఫ్ ది డార్క్ ఛేంబర్" నాటకాలు ఆమెకు అంతర్జాతీయ ఖ్యాతినార్జించి పెట్టాయి. సూర్యకుమారి ఆంగ్లేయుడైన హెరాల్డ్ ఎల్విన్‌ను 1973లో వివాహం చేసుకున్నా ఆ తరువాత వారు విడాకులు తీసుకున్నారు. ఆ దేశంలో భారతీయ కళల కోసం ఆమె ఒక సంస్థను ప్రారంభించింది. యోగవిద్యలోను, నృత్యంలోను ఆమె స్వయంగా యువతీ యువకులకు శిక్షణనిచ్చేది. 2004లో ఆమె ఆరోగ్యం దెబ్బతినడంతో ఇంటిపట్టునే వుండిపోయింది. తుదకు 2005 ఏప్రిల్ 25న ఆమె శాశ్వతంగా కన్నుమూసింది. ఆమె తెలుగు నేలను వదిలి విదేశాలకు వలసవెళ్ళినా, చివరకు మనల్ని శాశ్వతంగా వదిలి వెళ్ళినా ఆమె గంధర్వగానం, లలిత గీతాలకు ఆమె యిచ్చిన శాశ్వత అనశ్వరత్వం ఆమెను జ్ఞాపకం చేస్తూనే వుంటాయి. ◆

# అనుబంధం - డిస్కులో ఉన్న గ్రామఫోన్ పాటల వివరాలు

| | రికార్డు నెం. | పాట | గాయనీ గాయకులు |
|---|---|---|---|
| 1. | N 2813 | కోరి భజింతును... | కపిలవాయి రామనాధశాస్త్రి |
| 2. | N 2844 | ఏది గతి నాకు... | కపిలవాయి రామనాధశాస్త్రి |
| 3. | SN 35 | పోవుచున్నాడె... (రెండు భాగాలు) | ఉప్పులూరి సంజీవరావు |
| | (HUTCHINS) | | |
| 4. | SN 47 | జగదోద్ధార కోపమా... | సి. ఎస్. ఆర్. |
| 5. | SN 47 | అసమ మేధావి యగు... | సి. ఎస్. ఆర్ |
| | (HUTCHINS) | | |
| 6. | B.2032 | తనకు లోకాపవాదము... | అద్దంకి శ్రీరామమూర్తి |
| 7. | B.2032 | ప్రేమమయురాలు... | అద్దంకి శ్రీరామమూర్తి |
| 8. | SN 120 | జాణనే... | రామతిలకం |
| 9. | SN 120 | రాగము తీయబూనుట... | రామతిలకం |
| | (HUTCHINS) | | |
| 10. | CA 510 | కుప్పించి ఎగసిన... | వేమూరి గగ్గయ్య |
| 11. | CA 510 | భజగోవిందం... | వేమూరి గగ్గయ్య |
| | (ODEON) | | |
| 12. | NV.34 | విషయవాంఛలను... | దైతా గోపాలం |
| | (SUN) | | |
| 13. | F.T.6218 | రామ నామ మధుర ... | టి. రామకృష్ణశాస్త్రి |
| 14. | | తాపహారి నీవెగా... | టి. రామకృష్ణశాస్త్రి |
| | (TWIN) | | |
| 15. | B 2338 | పరబ్రహ్మ వదనే నవనీత ... | జొన్నవిత్తుల |
| 16. | | రావే శ్రీరమణ... | జొన్నవిత్తుల |
| | (BROADCAST-LP) | | |
| 17. | CA 623 | క్రిష్ణం భజరాధా... | కన్నాంబ |
| 18. | | విరహ సత్యప్రౌఢి... | కన్నాంబ |
| | (ODEON) | | |

| | | | |
|---|---|---|---|
| 19. | MAD 203 | ఎంత పాప జాతి... | పారుపల్లి |
| 20. | | ఈ చరణంబులె... | పారుపల్లి |
| | (ODEON-GERMANY) | | |
| 21. | F.T. 2037 | మేల్ మేల్ మేలౌర... | నాగయ్య |
| 22. | F.T. 2037 | శ్రీరామ మంత్రంబు... | నాగయ్య |
| | (TWIN) | | |
| 23. | | తలదాచుకొనుటకై... | ఆరణి సత్యనారాయణ |
| 24. | F.T. 641 | జలజనాభు కృప... | ఆరణి సత్యనారాయణ |
| | (TWIN) | | |
| 25. | N.7044 | మీరజాలగలడా... | స్థానం నరసింహారావు |
| | (RAMAGRAPH) | | |
| 26. | B 2115 | తల్లి గర్భము నుండి... | కొచ్చెర్లకోట |
| 27. | | తనయందు అఖిల... | కొచ్చెర్లకోట |
| | (BROADCAST-LP) | | |
| 28. | N.V.211 | రామభజన సేయరే... | పి.సూరిబాబు |
| 29. | | రామనామ స్మరణామృత... | పి.సూరిబాబు |
| | (SUN) | | |
| 30. | F.T. 381 | దశరథకుల తిలక...(రెండు భాగాలు) | కె.రఘురామయ్య |
| | (TWIN) | | |
| 31. | B.2322 | కోణంగి పద్దు... | బందా కనకలింగేశ్వరరావు |
| | (BROADCAST) | | |
| 32. | SN. 421 | ఎవ్వాని మహిమ... | ఎస్.రాజేశ్వరరావు |
| 33. | | కృష్ణ హరే ముకుందా... | ఎస్.రాజేశ్వరరావు |
| | (HUTCHINS) | | |
| 34. | CA 1249 | కనవా వినవా ..... | టి.సూర్యకుమారి |
| 35. | | ఏ దేశమునకు పోదాం ..... | టి.సూర్యకుమారి & మోహన్ |
| | (COLUMBIA) | (మెడ్రాస్) | |